# శాంతిదూత స్వామి ఓంకార్



**ది మిషన్ ఆఫ్ పీస్**

**శ్రీ శాంతి ఆశ్రమము**

**తోటపల్లి కొండలు, తూ.గో. జిల్లా - 533 446**

శాంతి దూత స్వామి ఓంకార్

మొదటి ముద్రణ: 21.1.2016
శ్రీ శాంతి ఆశ్రమ శత జయంతి ఉత్సవాల సందర్భంగా (21.1.2016 - 20.1.2017)

ప్రతులు: 1000

సర్వ హక్కులు: శ్రీ శాంతి ఆశ్రమము

ప్రచురణ: ది మిషన్ ఆఫ్ పీస్
శ్రీ శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు
తూ.గో. 533 446
ఫోన్: 7382009962

ముద్రణ: అభిసారిక ప్రెస్, సామర్లకోట
9246694228

**కృతజ్ఞతాభివందనములు**

ఈ పుస్తకమునకు ఆర్థిక సహాయం **కీ.శే. వాడ్రేవు రామకృష్ణారావు** గారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మరియు ఓ ఆశ్రమ భక్తుడు అందించారు. వీరికి పరమ పూజ్య శ్రీ ఓంకార్ స్వామి మరియు పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీ వారు శాంతి సౌభాగ్యములను ప్రసాదించెదరు గాక!

– ఆశ్రమ యాజమాన్యం

# శాంతము లేక సౌఖ్యములేదు

*ఓం శ్రీ ఓంకారాయ నమః*

**అశాంతస్య కుతః సుఖం?** (శాంతి లేని వానికి సుఖ మెక్కడ?) అని గీతాచార్యుల వారు అన్నట్లు శాంతి లేని మనస్సునకు సౌఖ్యము లభించదు. ప్రతి ప్రాణి, ప్రతి జీవి శాంతిని కోరుకుంటుంది. అయితే శాంతి ఎలా లభ్యం అవుతుంది? మహాత్ముల సాంగత్యం వారి దివ్య చరితములు అధ్యయనము చేయుట, వారి దివ్య గుణములను మనో వాక్కాయ కర్మల ద్వారా ఆచరించినపుడు, మన జీవితము శాంతివంతముగాను, ఆనందమయంగాను ఇతరులకు కల్యాణకరముగను వుంటుంది.

**శాంతిదూత స్వామి ఓంకార్** (పూర్వాశ్రమ నామం వెంకటేశ్వర / వెంకటరావు) వారు బాల్యము నందు భగవద్గీత విశ్వరూప సందర్శన యోగము (11వ అ.), బైబిలు అధ్యయనము ద్వారా విశాల హృదయముతో భగవద్గీత మరియు బైబిలు యొక్క సారాంశము ఒక్కటే అని గ్రహించిరి. స్వామి రామతీర్థ, శ్రీరామకృష్ణ పరమహంస బోధనలు వారి జీవితముపై ఎక్కువ ప్రభావము చూపడం వలన, వారు పూర్తిగా సమాజశ్రేయస్సుకై, విశ్వశాంతికై వారి జీవితమును త్యాగము చేసిరి.

బాల్యము నుండే కరుణ, ధైర్యము, సాహసము, త్యాగము వంటి గుణములు కలిగివున్నందువలన పెద్దవారైన తర్వాత వారు సమాధి స్థితిలోవుండి నిర్మల అనే బాలికకు 8 అంగుళముల తన కాలి ఎముకను త్యాగము చేసి మహాత్ములచే **"కలియుగ దధీచిగా"** ప్రఖ్యాతిని గాంచిన మహాత్యాగి.

అన్ని మతముల సారాంశమును అనుభవ పూర్వకంగా గ్రహించి **"వ్యక్తి శాంతియే – విశ్వశాంతికి పునాది"** అని వ్యక్తి వ్యక్తికీ బోధించిరి. స్వామీజీ అమెరికా పలుమార్లు పర్యటించి **"సర్వమత చిహ్నము, లోక శాంతి ప్రార్థన"**లను మతము, జాతీయత అన్న ప్రహరీని కూడా దాటి తూర్పు, పడమరలలోని అన్ని దేశస్థులకు, జాతులకు అందించిరి. తద్వారా విశ్వశాంతి స్థాపనకు శ్రీకారం చుట్టిరి. లోకశాంతి ప్రార్థన ఐక్యరాజ్య సమితిలో కూడా అందరి చేత ఆమోదించబడినది. వ్యక్తికి శాంతి ఎపుడు కలుగుతుంది అంటే భగవద్గీతలో చెప్పినట్లు **"అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ"** అంటే ఎవ్వరియందూ ద్వేషము లేకుండా మైత్రి, కరుణ కలిగిన మనస్సుకే శాంతి కలుగుతుంది. అటువంటి మానసిక స్థితి కలిగిన పౌరులే

విశ్వ శాంతికి మార్గదర్శకులవుతారు.

విశ్వశాంతికై అహర్నిశలు కృషిచేసి, క్షుదార్తులకు అన్నము, నిరక్షరాస్యులకు విద్య, రోగులకు వైద్యము, భవరోగులకు (సాధకులకు) ధ్యాన సాధన అందించుటకు భగవత్ ప్రేరణచే ప్రశాంతమైన అరణ్యములో తోటపల్లి కొండల్లో శాంతి ఆశ్రమమును 1917వ సం॥లో స్థాపించి, 1982వ సం॥ వరకు తన యావత్‌శక్తిని ధారపోసి, విశ్వశాంతికై తన జీవితాన్నంతా సమర్పణ చేసిన మహామనీషి **స్వామి ఓంకార్. శ్రీ శాంతి ఆశ్రమం 21.1.2016 నుండి 21.1.2017 వరకు ఆశ్రమ శతజయంతి ఉత్సవాలు జరుపుకోనున్నది.** ఈ శుభ సందర్భం ప్రారంభోత్సవ దినమున 'శాంతిదూత స్వామి ఓంకార్' అన్న ఈ పుస్తకము వెలువడుట సంతోషదాయకమైన విషయము.

**"ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః। భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।"** మా చెవులు శుభాన్నే వినుగాక! మేము మా కళ్లతో శుభాన్నే చూసెదముగాక! మన కళ్ళను, చెవులను ఏ విధంగా ఉపయోగించాలి అని పైన వ్రాసిన శాంతి మంత్రం చెపుతోంది! ఎందుకు మంచిని చూడాలి, మంచి మాటలే వినాలి అంటే మనము ఏ దృశ్యములయితే చూస్తామో, ఏ వాక్కులు, ఏ శబ్దములు అయితే వింటామో అవే మన మనస్సులో నాటుకుని ఆ విధంగా మన జీవితము తయారవుతుంది. అందుకే గాంధీమహాత్ముడు, **"చెడు చూడకు, చెడు మాట్లాడకు, చెడు వినకు"** అని బోధించారు మానవాళికి.

**శాంతిదూత స్వామి ఓంకార్** అనే ఈ పుస్తకములో ఓంకార్ స్వామి వారి జీవిత చరిత్ర విద్యార్థిని, విద్యార్థులకు మాత్రమే కాకుండా పెద్దవారికి కూడ సులభంగా, సరళంగా, క్లుప్తంగా అర్థం అయ్యేరీతిలో వారి జీవిత దృశ్యములు చిత్రముల ద్వారా అందించబడినది. ఇలా అందించుటలో కృషిచేసిన బ్రహ్మచారిణి వాసవి గారికి పరమపూజ్య ఓంకార్ స్వామి, పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీ భక్తి జ్ఞాన వైరాగ్యములు ప్రసాదించెదరు గాక! కథకు అనుగుణంగా చిత్రములు చిత్రించిన శ్రీ వై. పరబ్రహ్మం, రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్, ర్యాలి మరియు మరియు నేర్పుగా డిజైన్‌చేసి ముద్రించి ఇచ్చిన అభిసారిక ప్రింటర్స్‌కు మా ధన్యవాదములు తెలుపుకుంటున్నాము.

21.1.2016 — గురుసేవలో

తోటపల్లి కొండలు — **స్వామిని వినమ్రానంద**

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | పుట్టుక - బాల్యం | 8 |
| 2. | ఓర్పు - సహనము | 10 |
| 3. | భూత దయ | 11 |
| 4. | చదువుకొనే రోజులలో ఆధ్యాత్మిక మార్గానికి పునాది | 12 |
| 5. | సాధారణ మరియు బాధ్యతాయుతమైన జీవితం గడపడానికి ఒక పాఠం | 13 |
| 6. | ఓటమే గెలుపుకు మెట్టు | 14 |
| 7. | స్వామి రామతీర్థ సాహిత్యం - ఆధ్యాత్మిక మార్గానికి ప్రేరణ | 15 |
| 8. | అమెరికా మొదటి ప్రయాణం - ధీశాలి యువకుని సాహసం | 16 |
| 9. | హిమాలయాల్లో తపస్సు | 17 |
| 10. | శాంతి ఆశ్రమ స్థాపన మరియు శాఖలు | 20 |
| 11. | చిట్టి చెల్లెలు, తండ్రి జ్ఞాపకాలు - ఏకత్వం వైపు ప్రయాణం | 22 |
| 12. | అమెరికన్లకు శాంతి సందేశం | 23 |
| 13. | సోదరి సుశీలాదేవి | 25 |
| 14. | శాంతి ప్రార్థన - విశ్వశాంతి చిహ్నం | 28 |
| 15. | నవీన శిబి చక్రవర్తి | 30 |
| 16. | సాధన - మౌనం మరియు ఉపవాసం | 32 |
| 17. | రాజ వంశస్థుల స్పందన | 33 |
| 18. | మాతాజీ జ్ఞానేశ్వరి | 34 |
| 19. | షష్ఠిపూర్తి | 38 |
| 20. | తోటపల్లి కొండల రాక్‌ఫెల్లర్ | 38 |
| 21. | ఆదర్శ గురుకులానికి బీజం | 39 |

22. ఆశ్రమం చెట్లు - రక్తమాంసాలతో పోలిక 41
23. సేవా కార్యక్రమాలు 43
24. శాంతిదూత అంతిమ యాత్ర 49
25. ముగింపు ప్రార్థన 53
26. స్వామీజీకి ప్రేరణ ఇచ్చిన కథలు 54
27. ప్రఖ్యాత వ్యక్తులపై స్వామి ఓంకార్ యొక్క ప్రభావం 61
28. సోదరి శాంతి 64
29. విశ్వశాంతి గీతం - స్వామి ఓంకార్ 66
30. శ్రీ శాంతి ఆశ్రమం విశ్వశాంతి నిలయం - సోదరి సుశీలాదేవి 67
31. శ్రీ శాంతి ఆశ్రమం - ఒక పరిచయం 68
32. తోటపల్లి శాంతి ఆశ్రమ విభాగములు 70
33. శ్రీ శాంతి ఆశ్రమము వివిధ శాఖలలో జరుగు కార్యక్రమములు 71



# శాంతి దూత స్వామి ఓంకార్

**యదా యదాహి ధర్మస్య**
**గ్లానిర్భవతి భారత!**
**అభ్యుత్థాన మధర్మస్య**
**తదాఽఽత్మానం సృజామ్యహమ్** భ.గీ. అ4 శ్లోకం 7

ఎప్పుడెప్పుడు ధర్మానిది క్రిందిచేయి, అధర్మానిది పైచేయి అవుతుందో, అప్పుడప్పుడు భగవంతుడు తననితానే సృజించుకుంటున్నాడు అని గీతా వాక్యం. ఇది స్వామీజీ విషయంలో అక్షరసత్యమని చెప్పుకోవచ్చు.

20వ శతాబ్దము సగం గడిచేలోపలే, భయానకమైన రెండు ప్రపంచ యుద్ధాల్ని చవిచూడాల్సి వచ్చినది. ప్రపంచం అంతటా మిలియన్ల క్రొద్ది ప్రజలు మరణించారు. అహింస, ద్వేషాలతో ప్రపంచం నిండిపోయి వున్నది. మాతృభూమి భారతదేశమే కాకుండా విశ్వం అంతా శాంతి, ప్రేమల కోసం తీవ్రమైన ఆశతో అలమటిస్తోంది. ఎపుడైతే కలహములు, సమస్యలు భారతభూమి యందు తలెత్తుతాయో, అపుడు వాటిని పరిష్కరించడానికి భారతమాత వెంటనే సిద్ధంగా వుంటుంది. ఆ విధంగా ఆమె ఎందరో బిడ్డలకు జన్మనిచ్చినది. అదే విధంగా ఈసారి ఆమె ఒక బిడ్డకు జన్మనిచ్చినది. ప్రేమ, శాంతియే స్వరూపమైన ఆ బిడ్డ, ప్రపంచానికే శాంతి, దివ్యప్రేమ అనే సందేశాన్ని అందించారు.

ఓం! ఓం! ఓం!

# పుట్టుక - బాల్యము



దైవభక్తి, సదాచార సంపన్నులైన ఒక దంపతులు పిఠాపురములో నివసిస్తుండేవారు. ఆ వూరు ఆంధ్రరాష్ట్రంలో, తూర్పు గోదావరి జిల్లాలో వున్నది. ఆమెపేరు తెలియలేదు. ఆయనపేరు శ్రీ వెంకటాచలం గారు. ఆ దంపతులకు పిల్లలు లేనికారణంగా, అనేక నోములునోస్తూ, వ్రతాలు వుంటూ, అనేక ఆలయాలను దర్శిస్తూ కాలం గడుపుతున్నారు, సంతానం కోసం. ఒక శుభదినాన ఒక పొడవైన సాధు మహాత్ముడు వారి ఇంటిముందు ప్రత్యక్షమై వారికి మంత్ర జలాన్ని ప్రసాదించారు. ఆ దంపతులిరువురు ఎంతో పవిత్రభావం, భక్తితో ఆ మంత్రజలాన్ని స్వీకరించారు. ఆ మహాత్ముడిని పూజిస్తాము అనుకునే లోపలే అంతర్ధానం అయ్యెను.

కొద్ది నెలలు తర్వాత 21-1-1895వ తేదీన ఆ దంపతులకు ఒక మగశిశువు జన్మించెను. వారి ఆనందానికి అవధుల్లేవు. వారి ఆరాధ్యదేవుని పేరు ఈయన పేరుగా పెట్టారు. అయితే అది వెంకటేశ్వర్రో లేదా వెంకటరావో స్పష్టంగా నిర్దేశించబడలేదు. వెంకటేశ్వర జననము కొత్తపల్లెలోనా లేదా పిఠాపురములోనా అని ఖచ్చితంగా చెప్పలేము. తర్వాత వారికి అమ్మాజీ



అనే ఆడ శిశువు కూడ జన్మించెను. దైవదత్తమైన శిశువు వెంకటేశ్వర మూడు, నాలుగేండ్ల ప్రాయంలోనే పద్మాసనం వేసుకొని, ప్రతిమ వలె కదలక కూర్చుండిపోయేవాడు. శ్రీ వెంకటాచలం గారు ప్రతిరోజు పూజ, ప్రార్థనలు, భగవద్గీత పఠనం చేసేంతసేపూ వెంకటేశ్వర కదలక కూర్చుండి పోయేవాడు. భక్తి పారాయణులైన అలాంటి తల్లిదండ్రుల వలనే చిన్న వయస్సులోనే వెంకటేశ్వరకు ఆధ్యాత్మిక పునాది ఏర్పడెను.

❖❖❖❖❖

- శాంతి ఆశ్రమం, స్వామి ఓంకార్ వేర్వేరు కాదు ఒక్కటే

**- డా॥ శ్రీమతి థ్రిస్సోహం**

# ఓర్పు - సహనము



బాలకుడు వెంకటేశ్వర ప్రాథమిక విద్య తన గ్రామమైన పిఠాపురంలోనే ప్రారంభమయ్యెను. అలా ప్రతి రోజు పాఠశాలకు వెళ్ళేటప్పుడు, దారిలో క్రిందకు ఒంగిన ఒక పూరిపాక దాటి వెళ్ళాల్సి వచ్చేది. సరదాగా ఒక రోజు పాఠశాల నుండి వెనుతిరుగుతుంటే, పాకయొక్క వెదురు వెంకటేశ్వర నుదుటిలోకి లోతుగా దిగెను. రక్తం వేగంగా కారడం ప్రారంభించెను. వెంటనే వైద్యం చేయించిరి. గాయం లోతుగా ఏర్పడినందున నుదుటి మీద ఆ మచ్చ అలాగే వుండిపోయినది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే అంత లోతుగా గాయం ఏర్పడి, రక్తస్రావం అయినప్పటికి వెంకటేశ్వర బాధపడినట్లుగాని, భయపడినట్లుగాని దాఖలాలు లేవు. అపుడు ఆయన వయస్సు ఐదు లేదా ఆరు సంవత్సరాలు మాత్రమే! ఆవిధంగా చిన్న వయస్సులోనే ఆయన దగ్గర ఆధ్యాత్మిక జీవితానికి అవసరమైన సహనం, ఓర్పు అనే గుణాలు సహజంగానే కనిపించేవి.

❖❖❖❖❖



# భూతదయ



వెంకటేశ్వర దగ్గర చిన్నకుక్కపిల్ల వుండేది. ఒకసారి దురదృష్టవశాత్తు ఆ కుక్కపిల్లకు తేలుకుట్టెను. అది ఏడుస్తూ వుండెను. దాన్ని ఓదార్చడం చేతకాక తానుకూడ కుక్కపిల్లతోపాటు ఏడ్వసాగెను. తర్వాత పాలుపోక వీధిలోని ఇంటింటికి దాన్ని తీసుకెళ్ళి, దాని ఉపశమనానికి ఏమైన సహాయం చేయమని అర్థించెను. తర్వాత ఎలాగో ఒకలాగ దాని నొప్పి తగ్గిపోవడం వలన ఇద్దరూ సంతోషించిరి. ఈ విధంగా బాలుడు వెంకటేశ్వర బాల్యం నుండే మూగజంతువుల పట్ల ప్రేమను కలిగి వుండెను.

❖❖❖❖❖

# చదువుకొనే రోజుల్లో ఆధ్యాత్మిక మార్గానికి పునాది

వెంకటేశ్వర ఉన్నత విద్య పిఠాపురంలోని చల్లాయమ్మరావు ఉన్నత పాఠశాలలోను, తర్వాత విశాఖపట్నంలోని క్రిస్టియన్ బాప్టిస్టు మిషన్ ఉన్నత పాఠశాలలోను జరిగెను. అపుడు భగవద్గీతలోని 11వ అధ్యాయం విశ్వరూప సందర్శన యోగం ప్రతీరోజు చదవడం, బైబిల్ చదవడం విద్యార్థి దశలోనే ఆయనకు మంచి ఆధ్యాత్మిక పునాది ఏర్పరచెను. అంత చిన్న వయస్సులోనే భగవద్గీత, బైబిల్ యొక్క సారం ఒక్కటేనని వెంకటేశ్వర గ్రహించెను.

❖❖❖❖❖

- ఇన్నేళ్ళ నా ప్రవచనాలలో లభించని శాంతి అనుభూతి నేడు కలిగినందులకు కారణం, నాతోపాటు స్వామి ఓంకార్ ఉండడమే

**– శ్రీ ధనగోపాల్ ముఖర్జీ**
(ప్రముఖ వక్త, శ్రీరామకృష్ణ భక్తుడు)



# సాధారణ మరియు బాధ్యతాయుతమైన జీవితం గడపడానికి ఒక పాఠం

వెంకటేశ్వర బాల్యంలోనే తల్లిని కోల్పోయెను. తండ్రే, తల్లిగా కూడా వ్యవహరించెడివారు. శ్రీ వెంకటాచలం గారు తనకోసము ధనము ఏమి వుంచుకోకుండా అంతా కుమారుడు వెంకటేశ్వరకు ఖర్చుపెట్టేవారు. విశాఖలో చదువుకొనే రోజుల్లో విడిగా అద్దెగది తీసుకొని, తన స్నేహితుడు సోమయాజులుతోపాటు కలసి నివసించేవారు వెంకటేశ్వర. అలాగే ఖరీదైన దుస్తులు వాడుట, స్నేహితులతో సరదాగా గడుపుట చేసేవారు. ఖరీదైన బట్టలను గదిలో వ్రేలాడదీసి వుంచేవాడు. ఆ గది రోడ్డు ప్రక్కనే వుండుట వలన ఒక రాత్రి దొంగలు ఆ ఖరీదైన వస్త్రాలను, వస్తువులను అపహరించిరి. పోలీస్‌కి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడమే కాకుండా, వారు వెంకటేశ్వర అశ్రద్ధకు మందలించారు కూడ. అంతటితో అప్పటి నుండి వెంకటేశ్వరకు ఖరీదైన వస్త్రాలు, వస్తువులు మీద వ్యామోహం తొలగి జీవితాంతం సహజమైన, సాధారణమైన జీవితాన్నే గడిపారు.

❖❖❖❖❖



# ఓటమే గెలుపుకు మెట్టు

క్రమంగా వెంకటేశ్వరకు చదువుపట్ల శ్రద్ధ తగ్గెను, స్నేహితులతో సముద్రపు ఒడ్డున తిరుగుతూ గాలిమేడలు కడుతూ వుండేవాడు. అపుడు ఆంగ్లములో ఉత్తీర్ణుడు కాలేకపోయెను. అందువలన బాప్టిస్ట్ పాఠశాల నుండి ఎ.వి.ఎన్ కళాశాలకు మార్చిరి. అక్కడ పట్టుదలతో అనేక ఆంగ్ల పుస్తకములు చదువుతూ ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంచుకోవడమే కాకుండా, తప్పిపోయిన ఆంగ్ల పరీక్షలో ఉత్తీర్ణులయ్యిరి. అపుడు ఉత్తరాల ద్వారా తమిళనాడులోని, తిరునవ్వేలిలోని మానసిక వైద్య కళాశాల స్థాపకుడు, డా॥ రామస్వామిగారితో పరిచయం ఏర్పడెను. ఆయన హిప్నాటిజం, మెస్మరిజం అంటే వశీకరణ, మంత్ర విద్య, మనస్సును శాంత పరచుట వంటి విద్యలను వెంకటేశ్వరకు నేర్పడానికి ముందుకు వచ్చిరి. అంతేకాకుండ వెంకటేశ్వరను ఉత్తరాల ద్వారా విదేశస్థులకు కూడా పరిచయం చేసెను. ఆ విధంగా భగవంతుడు వెంకటేశ్వర జీవితంలో క్రొత్త మార్గాన్ని తెరచెను. విశాలమైన, సుందరమైన విశ్వంలోకి అడుగుపెట్టడానికి.....


❖❖❖❖❖

- ప్రపంచం అస్తవ్యస్తంగా, సమస్యలతో నిండివున్న ఈ తరుణంలో గాంధీజీ గారు కూడా మరణించారు. ఇక ప్రపంచం ఆధ్యాత్మికతను, శాంతిని గట్టిగా నిలుపుకోవడం కోసం శాంతి ఆశ్రమం వైపే చూస్తోంది

**- కౌంట్ ఇలియా టాల్‌స్టాయ్**
(లియో టాల్‌స్టాయ్ కుమారుడు)



# స్వామి రామతీర్థ సాహిత్యం - ఆధ్యాత్మిక మార్గానికి ప్రేరణ



డా॥ రామస్వామి “అకల్ట్” అనే పత్రికకు సంపాదకులుగా కూడా వుండే వారు. వెంకటేశ్వర తన రచనలను ఆ పత్రికకు పంపేవారు. ఆయన వెంకటేశ్వర ఆలోచనలను ఎంతో ప్రశంసిస్తూ, తన పత్రికలో వాటిని ప్రచురించేవారు. అంతేకాకుండా ఒక సందేశాన్ని “విశ్వప్రార్థన” అన్న పేరుతో ప్రచురించడమే కాకుండా, విడిగా చిన్న ప్రతిగా అచ్చువేసి రెండు వందల కాపీలు వెంకటేశ్వరకు పంపి, అతనిలోని రచయితను గుర్తించెను. ఆయన యొక్క పరిచయము వలన అమెరికాలోని “నెవాడా సైకిక్ కాలేజ్”లో ““ఆర్ట్ ఆఫ్ హీలింగ్”, మనస్సును శాంతపరచు విద్య చదవడానికి నాలుగు సం॥లకు విద్యార్థి వేతనం వెంకటేశ్వరకు ఏర్పాటయ్యెను.

అదే సమయంలో అదృష్టవశాత్తు, పంజాబ్ యొక్క కవి– ఋషి స్వామి రామతీర్థ యొక్క జీవితము - ఉపదేశాలు వెంకటేశ్వర మీద ఎంతో ప్రభావాన్ని చూపాయి. రామతీర్థ జీవితకార్యం చదివిన తర్వాత వెంకటేశ్వర మనస్సు పూర్తిగా లౌకిక వ్యవహారాల నుండి అలౌకిక జీవనం, ఆధ్యాత్మికతవైపు మళ్ళెను. బాహ్యం నుండి అంతరం వైపుకు మళ్ళెను. స్వామి రామతీర్థవలె జీవించాలని, శ్వాసించాలని, పనిచేయాలని, అన్నిటికంటె ఆయనలాగే అమెరికా వెళ్ళాలని వెంకటేశ్వరకు ప్రేరణ కలిగెను.

ఈ సమయంలోనే అనేక మంది స్నేహితులు, విద్యార్థులు, అనుయాయులు ఏర్పడి విశాఖ సముద్రతీరంలో ప్రార్థనలు, ధ్యానము సాధన చేయసాగిరి. ఆ సమయంలో వెంకటేశ్వర “అకాడమి ఆఫ్ రెలిజియన్స్” అన్న పేరుతో మతముల విద్యా సంస్థను స్థాపించి, తద్వారా అందరి ఆధ్యాత్మిక జీవన వున్నతికి పాటుపడటం ప్రారంభించెను.

❖❖❖❖❖

# అమెరికా మొదటి ప్రయాణం - ధీశాలి యువకుని సాహసం

వెంకటేశ్వర ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న తన విదేశయాత్రకు సమయం ఆసన్నమైనది. ఆయన ప్రయాణించిన నౌక పేరు "ద సిటీ ఆఫ్ బెనారస్" నౌక పేరులోనే విశ్వనాథుడి స్ఫురణ కలుగుతుంది. అది సామానులు మోసే కార్గో నౌక. నౌక ఎల్లీస్ నగరము వద్దనే ఆపేశారు, తనిఖీ కొరకు. తనిఖీలో వెంకటేశ్వర వయస్సు చాలా తక్కువ అని, అమెరికాలో నివసించేందుకు తగిన ఆర్థిక స్థాయి కూడా లేదన్న కారణంతో అమెరికా ప్రవేశాన్ని నిరాకరించారు. ఎన్నో రోజుల నుండి కన్న కలలు కల్లలాయెను. బరువెక్కిన హృదయంతో నిరుత్సాహంతో లండన్ మీదగా భారతదేశం వెనుతిరిగారు. ఆ సమయంలో భగవద్గీత, స్వామి రామతీర్థ సాహిత్యం, అబ్రహాం లింకన్ చెప్పిన

**"చీకటి నుండి వెలుగువైపుకు**
**అసహాయత నుండి సహాయత వైపుకు**
**నిరాశ నుండి ఆశవైపు సాగిపొమ్ము"**

అన్న మాటలు ఎంతో ఉపశమనాన్ని కలిగించాయి, వెంకటేశ్వర్‌కు. అపుడు మనసులో సంకల్పము చేసుకొనెను, స్వామి రామతీర్థవలె జ్ఞాన జ్యోతిని చేతపట్టి పశ్చిమ దేశాలకు సేవచేయడానికి సన్యాసిగా తిరిగి అమెరికాకు వస్తాను అని.

వెంకటేశ్వర అమెరికా ప్రవేశం లభించక వెను తిరిగిన తర్వాత, వైద్యుడు కావాలనే ఆశతో మరో ప్రయత్నంగా, కలకత్తాకు హోమియో వైద్యం చదవడానికి వెళ్ళెను. కాని అతని మనస్సు నిశ్శబ్దాన్నీ, నిర్మానుష్యాన్ని కోరడం మొదలు పెట్టడం వలన తరచుగా దక్షిణేశ్వరం వెళ్లి శ్రీరామకృష్ణ పరమహంస వున్న తావులో ధ్యానం చేసేవాడు. అదే సమయంలో తీవ్రంగా మలేరియా వ్యాధి పీడించగా చదువును మధ్యలోనే చాలించి ఆంధ్రకు తిరిగివచ్చేశారు.

❖❖❖❖❖



# హిమాలయాల్లో తపస్సు



వెంకటేశ్వర్‌కు వైద్యుడు కావాలన్న లౌకిక వాంఛ సన్నగిల్లి, మనస్సు సత్యాన్వేషణ యందు మ్రొగ్గు చూపడం ప్రారంభించెను. మొట్టమొదటిసారిగా ఇల్లు వదలి సర్వసంగపరిత్యాగిగా ఒంటరిగా పూరీ జగన్నాథుని వరకు యాత్ర చేసెను. తర్వాత ప్రయత్నంగా హిమాలయాలకు తపస్సుకు బయలుదేరెను. శ్రీరామతీర్థ గ్రంథాలు, భగవద్గీత, అష్టావక్రగీత, అవధూత గీత వంటి కొన్ని గ్రంథాలను చేతబట్టి, మార్గంలో ముందుగా కలకత్తాలోని భవతారిణి అయిన కాళీమాతను సేవించి, తర్వాత కాశీలోని విశ్వేశ్వరుని దర్శించి ఆ తర్వాత నీలకంఠేశ్వర పర్వతశ్రేణి క్రిందవున్న ఋషికేష్‌లోని స్వర్గాశ్రమాన్ని చేరెను. ఆ ఆశ్రమం రెండు మైళ్ళ విస్తీర్ణంలో వుంది. ఆశ్రమ అధిపతి మహంతు శ్రీ ఆత్మ ప్రకాశ్‌ను కలిసి సాధన చేసుకొనుటకు ఆశ్రయం కోరెను. చిన్న వయస్కుడైన వెంకటేశ్వర్ మాటలు నమ్మజాలక, చాలా దూరంలో శిథిలమై, తేళ్ళూ, జెర్రులతో వుండే కుటీరం ఇచ్చి అక్కడ వుండమని చెప్పిరి. ఎంతో కృతజ్ఞత తెలిపి భావపారవశ్యంతో అక్కడ నివసించసాగెను.



ఒకానొక శుభదినాన వెంకటేశ్వర, హృదయాంతరవాసియైన సర్వేశ్వరుడొక్కడే తన గురువుగా స్వీకరించి, ప్రాతఃకాలమే లేచి గంగాతీరానికి వెళ్ళి, ఆ మాతను ధ్యానించి పాత దుస్తులన్నీ గంగామాతకు అర్పించి కాషాయ దుస్తుల్ని ధరించెను. ఇక జీవితంలో అనుక్షణం భగవత్ కార్యాలే చేస్తుంటానని సంకల్పం చేసెను. సర్వకాల సర్వావస్థలలో ఓంకారాన్నే జపించే వెంకటేశ్వర్‌ను అందరూ ఓం స్వామి అని, ఓంకార్ స్వామి అని పిలుచుట వలన, వెంకటేశ్వర్ సన్యాసనామం "స్వామి ఓంకార్" అయ్యెను. స్వామి ఓంకార్‌కు ప్రతి అణువులోను, ప్రతిశ్వాసలోను ఓంకార్ ప్రకంపనలు అనుభూతమయ్యేవి. ఓంకారం అంధకారాన్ని తొలగించి, ఆత్మ ప్రకాశాన్ని ఎరుకచేస్తుంది. ఆ విధంగా 6 సంవత్సరాలు ఓంకార్ స్వామి హిమాలయాలలో తపస్సు చేసెను.

స్వామి రామతీర్థ ఒక రోజుకు 40 మైళ్ళ నడిచారని చదివి, బదిరీనాథ్ యాత్రలో స్వామి ఓంకార్‌కూడా అదే విధంగా నడిచిరి. కాళ్ళు బొబ్బలెక్కి అలసిపోయిన సమయంలో ఎవరో ఒక ఆగంతకుడు, "బాబా! నడిచి నడిచి అలసిపోయిన మీ పాదాలకు నూనె మర్ధన చేస్తానని, ఎంతో నేర్పుగా





మర్దన చేసి స్వాంతనము కలిగించెను. అలాగే ఆకలిగా, నీరసంగా వున్నపుడు ఎక్కడ నుండో ఒకతను వచ్చి, "బాబాజీ! మీ నీరసం తగ్గుతుంది" అంటూ పాలతో చేసిన సగ్గుజావ ఇచ్చెను. ఈ విధంగా స్వామిని దైవం అణువణువునా సంరక్షించేవాడు అనేదానికి అనేక నిదర్శనలు కనిపిస్తాయి, ఆయన జీవిత చరిత్ర అంతా!

❖❖❖❖❖

- ఏకాంత వాసానికి శాంతి ఆశ్రమము తగిన ప్రదేశము. స్వామి ఓంకార్ ప్రయత్నాలు చాలా అమూల్యమైనవి. మరియు ఏకాంతవాస ఆరాధకులకు, తమ అర్హతను పెంపొందించడంలో శాంతి ఆశ్రమం శ్రద్ధ వహిస్తున్నది.

**– స్వామి నారాయణ్**
(స్వామి రామతీర్థ ప్రత్యక్ష శిష్యులు)

# శాంతి ఆశ్రమ స్థాపన మరియు శాఖలు

శ్రీ కక్కిరాల రామారావు మరియు రత్నమ్మగార్లు గట్టి ప్రయత్నంతో స్వామి ఓంకార్‌ను హిమాలయాల్లోనే వుండిపోనివ్వకుండా ఆంధ్రాకు రప్పించడంలో కృషిచేశారు. అలా పిఠాపురం మరియు చుట్టు ప్రక్కల గ్రామస్థులకు ఆధ్యాత్మిక సేవలు అందిస్తూ స్వామీజీ సామర్లకోట చేరెను. సామర్లకోటలో వున్నప్పుడు చింతలూరు నుండి లక్షణస్వామి అనే కౌలుదారు గట్టి ప్రయత్నంతో "తోటపల్లి కొండల్లోని మల్లిఖార్జున ధార" చూడడానికి స్వామీజీని ఆహ్వానించెను. ఇక ఆ తర్వాత అక్కడి నుండి వెనుతిరగ లేదు స్వామీజీ. ఆ అందమైన నిశ్శబ్దమైన అరణ్య సౌందర్యం ఆయన్ను కట్టి పడవేసెను. "స్థలాభోగం, శిలాభోగం" దైవమే నిర్ణయిస్తాడు అన్నట్లు ఆ అడవే తర్వాత కాలంలో ప్రపంచ వ్యాప్త శాంతి స్థాపన కేంద్రంగా వర్ధిల్లెను. ప్రాక్, పశ్చిమ దేశస్థులకు శాంతిధామంగా వర్ధిల్లెను.

అది 1917వ సం॥ అపుడు స్వామి ఓంకార్‌కు వయస్సు 22 సంవత్సరములు. చింతలూరు లక్షణస్వామి 10 ఎకరాల భూమిని ఆశ్రమ స్థాపనకు ఇచ్చెను. అపుడు ఆ స్థలంలో మొక్కలు ఏమిలేవు. రాళ్ళ గుట్టలూ, ముళ్లపొదలతో నిండి వన్యమృగాలు స్వేచ్ఛగా తిరుగాడేవి. కాని ఆ స్థలంలో చాల పెద్ద మామిడి వృక్షం ఒకటి వుంది, దానికి ఉయ్యాలవేసి రాత్రిస్వామి దానిలో నిద్రించేవారు. చెట్టుక్రింద ధ్యానం చేసుకునేవారు. లక్షయ్య వారి తమ్ముళ్ళు ఆ చెట్టు సమీపంలో ఒకపాకవేశెను. చెందుర్తి గ్రామం నుండి సూరమ్మ అనే ఆమె వచ్చి వుంటూ, వంటచేసి పెట్టేది. తర్వాత వెంకటనగరములో "మొఖసాదారు" అన్న పదవి గల వ్యక్తి కొంత భూమిని ఆశ్రమమునకు ఇచ్చెను.

చింతలూరుకు చెందిన వెంకటేశు అనే చెప్పులు కుట్టి జీవించే వ్యక్తి, ఆశ్రమానికి వచ్చి ఎనలేని సేవలుచేసెను. అతడు స్వచ్ఛమైన మనస్సుతో తరచూ స్వామీజీతో అనేవాడు. "స్వామీజీ! మన ఆశ్రమం చాలా పెద్దదిగా ఆ కొండల వరకు పెరుగుతుంది. ఇక్కడ విద్యుత్ దీపాలు వస్తాయి. భక్తులు కార్లమీద, బస్సుల్లోను వస్తారు" అని. 50 సంవత్సరాల తర్వాత ఆ పవిత్ర హృదయంతో పలికిన పలుకులు సత్యం అయ్యెను అని స్వామీజీ అనేవారు.



తర్వాత శ్రీ మరియు శ్రీమతి జి. అప్పారావు గారు స్వామీజీ ప్రేరణతో తునిలో శాంతి కేంద్రమును స్థాపించిరి. ఆ తర్వాత వాల్తేరులో శాంతి ఆశ్రమ శాఖ ప్రారంభించబడెను. శ్రీ పురుషోత్తమ పంతులుగారు మొట్టమొదటిసారిగా 2 ఎకరాల భూమిని ఆశ్రమ ప్రారంభం కొరకు ఇచ్చెను. విశాఖపట్నంలోని కైలాసగిరిలో రెండవ ప్రపంచ యుద్ధసమయంలో యుద్ధప్రాతిపదిక మీద రాడార్ కేంద్రం నిర్మించబడెను. యుద్ధం ముగిసిన తర్వాత మిలటరీ దాన్ని వేలం వేసి, తర్వాత తొలగించాలని నిర్ణయించెను. ఆ సమయంలో ఆశ్రమ భక్తులు నారాయణస్వామి, మరియు కర్ణం పి. నారాయణరావుగారు స్వామీజీకి విషయం తెలిపి, అక్కడ శాంతి ఆశ్రమ శాఖ వచ్చుటకు తోడ్పడిరి. యుద్ధ ప్రాతిపదిక కేంద్రంను శాంతి ప్రాతిపదిక కేంద్రంగా స్వామీజీ మార్చివేసిరి.

అదేవిధంగా 1957వ సం॥లో దసపల్లా రాజు, రాణిగార్లు వారి విలువైన ఎస్టేట్‌ను తక్కువ వెలకు కోటగిరిలో శాంతి ఆశ్రమ శాఖ ప్రారంభించుటకు ఇచ్చిరి. "నీరు లేక దాహంతో చనిపోతున్న మనిషిని వచ్చే సంవత్సరం రా ఇస్తాను" అన్నట్లుంది మీ సమాధానం అని సోదరి లలితాదేవిగారు (శ్రీమతి లులు విల్డింగ్, బ్రిటిష్ మహిళ) వ్రాసిన హృదయ విదారకమైన వుత్తరం కోటగిరి శాఖ ప్రారంభమునకు నాంది అయ్యెను. తర్వాత వీరు కోటగిరి శాఖకు అధ్యక్షులుగా ఉన్నారు. కోటగిరిలో 1966వ సం॥ అప్పటి మైసూర్ గవర్నర్ శ్రీ వి.వి.గిరి గారు ప్రార్థనా మందిరము, లైబ్రరీ ప్రారంభోత్సవమునకు వచ్చిరి.

❖❖❖❖❖

- శాంతి ఆశ్రమము యువతకు శిక్షణా స్థలము, మధ్య వయస్కులకు దీపస్తంభము, మరియు వృద్ధులకు ఓదార్పు, నిజమైన ఆశ్రయము ఇచ్చు స్థలము.

**– శ్రీ వేలు మొదలియార్, పెద్దాపురం**
(స్వామి రామతీర్థ ప్రత్యక్ష శిష్యులు)

# చిట్టి చెల్లెలు, తండ్రి జ్ఞాపకాలు - ఏకత్వంవైపు ప్రయాణం


వెంకటేశ్వర్‌కు ఒక చిట్టిచెల్లెలు వుండేది. ఆమె పేరు అమ్మాజీ. అమ్మాజీకి తన సహోదరుడు అంటే అమితమైన ప్రీతి. అంతేకాకుండా ఆమె చాలా భక్తి పరాయణురాలు. తనకు ఎవరు ఏమి ఇచ్చినా అది అన్నకోసమే వుపయోగించేది. అన్ననే ప్రేమిస్తూ, సేవిస్తూ అన్నకోసమే బ్రతికేది. ఆమె కేవలం 12 ఏండ్ల ప్రాయంలోనే హఠాత్తు మరణానికి గురిఅయ్యెను, చివరికి ప్రాణములు విడుచు సమయంలో కూడ అన్న పేరే ఆమె పెదాలమీద మెదిలెను. కాని అపుడు పూర్తిగా ఊహాలోకంలో విహరిస్తూ స్నేహితులతో కాలక్షేపంచేస్తూ, తన విదేశయాత్రకు సంసిద్ధమౌతున్న వెంకటేశ్వరుకు ఈ సోదరి ఘటన అంత పెద్ద విషయంగా అనిపించలేదు. కాని తర్వాతతర్వాత కాలంలో దాని ప్రాముఖ్యతను గుర్తించి, తన జీవితంలో ఎదురైన ప్రతి సోదరిలోను, తన సోదరిని చూచుకుంటూ సేవచేసి తృప్తి చెందెను. అంతేకాకుండా సోదరి జ్ఞానేశ్వరి తనచెల్లి యొక్క పునర్జన్మగా భావించెను.

అదేవిధంగా స్వామి ఓంకార్ యొక్క తండ్రి శ్రీ వెంకటాచలంగారు కూడా తల్లీ, తండ్రిగా వుంటూ, తన సర్వస్వాన్ని తనకు చేతనైనంతగా వెంకటేశ్వర శ్రేయస్సుకోసం వినియోగించెను. విశాఖలో చదివించడానికి, అమెరికా పంపడానికి, చివరికి ఆశ్రమం స్థాపించిన తర్వాత కూడా ఎంతో ప్రీతితో, దయతో సహాయంచేసెను. కాని చివరి రోజులలో ఇరుగుపొరుగు వారి మాటలు విని ఆయన సొంతగ్రామానికే వెళ్ళిపోయారు. అవసాన దశలో తన ఒక్కగానొక్క కుమారుడికి కూడా దూరంగా వుండెను. అప్పట్లో స్వామీజీకి కూడా తండ్రి ప్రాముఖ్యత తెలియలేదు. తర్వాతర్వాత అందరిలో తన తండ్రిని చూచి సేవించడం ప్రారంభించెను.

❖❖❖❖❖



# అమెరికన్లకు శాంతి సందేశం



స్వామి ఓంకార్ 1923 వ సంవత్సంలో రెండవసారి అమెరికా యాత్ర చేసెను. భగవత్ ప్రేరణతో శ్రీమతి మరియా, శ్రీ రాల్ఫ్ ఎంట్రికన్ అనే దంపతులు, పూర్తి బాధ్యత వహించి స్వామి ఓంకార్‌ను అమెరికాలోని ఫిలడల్ఫియాకు రప్పించిరి. స్వామీజీతోపాటు కక్కిరాల రామారావుగారి కుమారుడు ఆత్మారామ్ 12 ఏండ్ల వయస్కుడు, స్వామీజీతో అత్యంత సన్నిహితంగా మెలగుట వలన అతడు కూడా అమెరికా వెళ్ళెను. బాల్యంలోనే తల్లిని కోల్పోయిన స్వామీజీకి మరియామాత దివ్యప్రేమ, మాతృప్రేమను అనుభూతికి తెచ్చెను. మరియా మాతకు స్వామీజీ వ్రాసిన వుత్తరాల ప్రేరణతో ఆమె "ది సోల్ ఆఫ్ ఓంకార్" అన్న పేరుతో వ్రాసిన అంశాలను తర్వాత పుస్తకంగా ప్రచురించిరి.

అమెరికాలో స్వామీజీ ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇవ్వడం, ఆసక్తి వున్నవాళ్ళకు ఉపదేశము ఇవ్వడం, సాధనా పద్ధతులు నేర్పడం, మరియు ఆధ్యాత్మిక జీవితానికి అత్యంత ముఖ్యమైన "ఆధ్యాత్మిక దినచర్య"ను ప్రతి ఒక్కరిచేత వ్రాయించడం, పైగా స్వయంగా తానే ఆ దినచర్య పుస్తకాన్ని

చదివి తప్పొప్పులను గ్రహించి సాధకులు సాధనలో ముందుకు వెళ్ళడానికి మార్గం చూపేవారు.

1928వ సం॥లో స్వామీజీ 3వసారి అమెరికా వెళ్ళెను. అక్కడ 1929వ సం॥లో డిశెంబర్ నెలలో కాలుజారి పడి ఎడమతుంటి విరిగి 6నెలలు కట్టు వేయబడెను. అదే సమయంలో స్వామీజీ 40 రోజులు మౌనం కూడా పాటించెను. స్వామీజీ 3వ అమెరికా ప్రయాణంలో అనేక శాంతి కేంద్రాలు స్థాపించబడెను. తిరిగి వచ్చేటప్పుడు కుమారి ఎలన్ సెయింట్ క్లేయర్ నోవాల్ట్ అనే అమెరికా సోదరి స్వామీజీతోపాటు భారతదేశము వచ్చెను. ఆమెకు సోదరి సుశీల అని స్వామీజీ నామకరణం చేసిరి.

మరళా 1937 వసం॥లో స్వామి ఓంకార్ సోదరి సుశీల దేవితోపాటు 4వసారి అమెరికా ప్రయాణం చేసెను. స్వామీజీ జపాన్, చైనా, కొలంబో వంటి దేశాలను సందర్శించెను. స్వామీజీ ఉపన్యాసాలకన్న ఆయన సన్నిధిలో విదేశీయులు ఎంతో ఆనందాన్ని అనుభవించేవారు. విదేశీయ భక్తులు ఆయనతో "క్రైస్తవుల సభలో మాట్లాడితే క్రీస్తు సాన్నిధ్యాన్ని, బౌద్ధుల సభలో మాట్లాడితే బుద్ధుని సాన్నిధ్యాన్ని మీచెంత పొందాము" అనేవారు. ఆ విధంగా ఏ దేశస్థులు అయిన, ఏజాతి వారైనా స్వామీజీ సన్నిధిలో భగవత్ సాన్నిధ్యాన్ని అనుభవించేవారు. ఆ కాలంలో అనేక దేశస్థులు స్వామీజీ స్థాపించిన శాంతి ఆశ్రమానికి పూర్తి సహకారాన్ని అందించారు. న్యూయార్క్, లాస్ఏంజల్స్, హాలీవుడ్, రంగూన్, ఫిలిడెల్ఫియా, జర్మని వంటి అనేక నగరాలలో శాంతి కేంద్రాలు స్థాపించబడినాయి. డా॥ డెల్వలి, కుమారి విక్టోరియ ఫెర్గూసన్, శ్రీమతి జేన్ డి లిల్లీ, శ్రీమతి హొగన్, మాతృదేవి మరియా, రాల్ఫ్ ఎంట్రికన్, మిద్రెడ్‌షేవార్డ్, హేవార్డ్ వంటి వారు శాంతి కేంద్రాల స్థాపనలో, ప్రచారంలో ముఖ్యపాత్రను వహించడమే కాకుండా స్వామీజీకి కాలు ఎముక విరిగి పూర్తిగా మంచంలో వుండాల్సి వచ్చినప్పుడు ఎనలేని సేవలుచేసిరి.

1938వ సం॥లో స్వామీజీ అమెరికా నుండి తిరిగి భారతదేశము వచ్చారు. పీస్ పత్రికను, స్వామీజీ సాహిత్యాన్ని అనేక విదేశీయులు ఎవరికి వారే తమ భాషలలోనికి స్వేచ్ఛగా స్వతంత్రంగా అనువదించుకొని మహదానందాన్ని అనుభవించేవారు.

❖ ❖ ❖ ❖ ❖



# సోదరి సుశీలాదేవి



సోదరి సుశీలాదేవి అమెరికాలోని న్యూజెర్సీ నగరానికి చెందినవారు. స్వామీజీ అమెరికా వెళ్ళివున్నప్పుడు ప్రేరితులై సత్యాన్వేషణలో, సేవచేయుటకై తోటపల్లి శాంతి ఆశ్రమమునకు వచ్చిరి. ఆమె భారతదేశమునకు వచ్చీ రాగానే ఆహారము, భాష, వస్త్రధారణ అన్నింటిని బుద్ధిపూర్వకంగానే కాకుండా బాహ్యంగా కూడ స్వీకరించి వ్యక్తీకరించారు. ఆమె చీరకట్టులో హిందూమహిళగా జీవించి చూపారు. ఆమెలో ఉన్నతమైన ఋషితుల్య ఆధ్యాత్మిక ప్రేమ మరియు విశ్వాన్నంతటినీ ఉత్సాహపరచగలిగే శక్తి కనిపించేవి. ఆమె నర్సు అయినందున, ఆశ్రమంలోను చుట్టు ప్రక్కల గ్రామాలలోను ప్రజలకు నర్స్‌గా వైద్య సహాయం అందించేవారు. ఆశ్రమ ఉత్తర ప్రత్యుత్తరాలు టైపుచేయడం, వచ్చిన వారికి భోజన సదుపాయాలు చూడడం చేసేవారు. ఆశ్రమంలోని బాలబాలికలకు, మూగజీవులకు సేవచేసేవారు. ఆమె ఆశ్రమానికి కార్యదర్శిగా కూడా బాధ్యత నిర్వహించారు. అంతేకాకుండా రవీంద్రనాథ్ ఠాగూర్ వలె చక్కటి హృదయ నివేదనా గీతాలు వ్రాసేవారు. ఆమె "మిస్టిక్ ప్రేయర్స్ అండ్ పోయమ్స్" అనే పుస్తకం వ్రాశారు.

సుశీలాదేవి జంతువుల్ని అందరిలా ప్రేమించడమే కాకుండా, దైవాంశ గలవిగా తలచి సేవచేసేవారు. ఆవులకు కళ్ళనీరు కారినా, కుక్కలకు దెబ్బలు తగిలినా శుభ్రంచేసి, మందులు వేసేవారు. ఒక రోజు అర్ధరాత్రి ప్రక్కగ్రామం నుండి చిన్నదూడ అంబా అంబా అంటూ ఆమె కుటీరం దగ్గర్లో వచ్చి పడిపోయెను. ఆ అంబారావాలు విని లేచి వెళ్ళి దాని డెక్కలో వున్న ముళ్ళుతీసి,



శుభ్రపరచి వొళ్ళంతా వేడి నీళ్ళతో ఒత్తి, మెత్తని ప్రక్కవేసి పడుకోబెట్టెను. ఒకసారి ఎలుక నాలుగు పిల్లల్ని పెట్టి చనిపోయింది. ఆమె వాటిని అట్టపెట్టెలో పెట్టి సంరక్షించినది. అలాగే దీపం పెడితే వేలాది పురుగులు అందులోపడి చనిపోతాయని, దీపం ఆర్పి చీకటిలో కూర్చొని వుండేది. ఒకసారి ఆశ్రమం కుక్క రామీ మీద చిరుతపులి పడి గాయపరిస్తే, రక్తపు మడుగులో వున్న రామీని వైద్యశాలలో చూపించి ప్రాణాలు రక్షించినది. ఆమె ఎద్దుల బండి ప్రయాణం నిషేదించేది. ఎందుకంటే బండితోలేవాళ్ళు ఎద్దులను కొట్టితే ఆమె భరించలేకపోయేది. అందుకే మూగజీవులు తమ కష్ట, సుఖాలను సోదరి సుశీలగారితో పంచుకునేవి. ఆమె యొక్క దయ, కారుణ్యం, ఫ్లొరన్స్ నైటింగేల్‌ను గుర్తుకు తెచ్చేవి.

శాంతి ఆశ్రమానికి దాదాపు 25 సం॥లు సేవచేసిరి. ఆమె మాతృమూర్తికి అనారోగ్యం వలన అమెరికాకు తిరిగి వెళ్ళిరి. ఆమె కుటీరంలో లేదని తెలుసుకొని మూగజీవులు ఏడ్చేవి. ఆమె కోసం పిల్లలు పరితపించేవారు. ఆమె లేమికి అమాయకంగా ఒక బాలుడు అనెను. "సోదరి సుశీల వూరికి దారి తెలుసుకోవడానికి నేను ఖగోళశాస్త్రం నేర్చుకొంటున్నాను."





ఆమె జాతి, జాతీయత అన్న ఎల్లనుకూడ దాటి సర్వులయందు సర్వేశ్వరుణ్ణి మాత్రమే చూసేవారు. కొన్నాళ్ళ తర్వాత మరల భారతదేశానికి తిరిగి వచ్చేందుకు సంసిద్ధం అయివున్న తరుణంలో 14-11-1957వ సం॥లో న్యూజెర్సీలో ఆమె మరియు ఆమె సోదరుడు కారు ప్రమాదంలో అశువులు బాసిరి. ఆమె మరణం ఆశ్రమానికి తీరనిలోటుగా పరిణమించెను.

ఆమె మరణం తర్వాత, ఆమె లేని లోటుకు స్వామీజీ అంటారు ఈవిధంగా "శుక మహర్షి ఇల్లు వదలి, తపస్సు చేయుటకు అడవులకు బయలుదేరి వెళ్ళిపోయినప్పుడు, అతని పట్ల ఎంతో మక్కువ కలిగిన తండ్రి వ్యాసుడు, శుక...శుక అని పిలుస్తుంటే ప్రకృతంతా ప్రతి స్పందించినదట. ఆ విధంగా సోదరి సుశీల మరణం తర్వాత ఆమెను తలచుకుంటే శాంతి ఆశ్రమంలో ప్రకృతంతా ప్రతిస్పందిస్తోంది". తర్వాత ఆమె జ్ఞాపకార్థంగా శాంతి ఆశ్రమంలో మొబైల్ మెడికల్ యూనిట్‌కు "సుశీల పీస్ వాన్ " అని, వైద్యశాలకు "సుశీల వైద్యశాల" అని పేరు పెట్టారు.

❖ ❖ ❖ ❖ ❖

# శాంతి ప్రార్థన - విశ్వశాంతి చిహ్నం



లోపలను వెలుపలను, మీదను క్రిందను, అంతటను నిండియుండి, నేత్రములకు నేత్రము, కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము, మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము, ఆత్మలకు ఆత్మగా వున్న భగవంతుడ్ని ఇప్పుడు, ఇక్కడనే, ఈ నిమిషమే తెలుసుకునేందుకు కృషి చేయాలి. తూర్పు పడమరల, ఉత్తర దక్షిణముల ఈ విశ్వము నందంతటను, అందరును భగవంతుడి దివ్య తేజస్సును గ్రహించాలి. ప్రతి మానవ హృదయము నందును, నానాజాతుల మధ్య శాంతి, సామరస్యములు నెలకొనాలి అన్నదే ప్రతియొక్కరి యొక్క ప్రార్థన కావాలి. లోకా సమస్తా సుఖినో భవంతు!

శాంతి ప్రార్థన ప్రతి రోజు పఠించడం వలన వ్యక్తి శాంతి, తద్వారా విశ్వశాంతికి దారితీయును. ఇది అనేక దేశీయ, విదేశీయ భాషలలోనికి అనువదింపబడి చాలా ప్రాచుర్యం పొందినది. సంస్కృతంలోనికి స్వామి చిన్మయానందుల వారు అనువదించిరి. ఒకసారి భక్తులెవరో స్వామీజీకి వ్రాశారు, "శాంతి ప్రార్థన 108 సార్లు ఉచ్ఛరిస్తే సమాధి స్థితి అనుభవం అవుతోందని" శాంతిప్రార్థన ఉపనిషత్తుల యొక్క సారం. ముఖ్యంగా కేనోపనిషత్తు యొక్క సారం.

విశ్వశాంతి చిహ్నంలోని ఓంకారం, పద్మం, శిలువ, నెలవంక, నక్షత్రం అన్ని మతాల యొక్క కలయికను సూచిస్తాయి. ఓంకారం హిందూ మతాన్ని సూచిస్తుంది. ఇది సృష్టి స్థితి లయలలోను వుంటుంది. అన్ని నామాలలోను,




శబ్దాలలోను వుంది. ఓంకారము దేన్నీ విడిచిపెట్టకుండా అన్నింటిని తనలో కలుపుకుంటుంది. అ–ఉ–మ = ఓమ్. "అ" బౌద్ధమతాన్ని, "ఉ" క్రైస్తవ మతాన్ని, "మ" మహమదీయ మతాన్ని, మొత్తం కలిపి ఓమ్ హిందూ మతాన్ని సూచిస్తుంది. శిలువ క్రీస్తు జీవితం త్యాగాన్ని, తోటి మానవులకు సేవచేయడాన్ని సూచిస్తుంది. పద్మం బౌద్ధమతంలోని ప్రేమ, కరుణను సూచిస్తుంది. నెలవంక మహమద్ యొక్క ధైర్యము, బలము, ఆత్మ సమర్పణ సూచిస్తుంది. నక్షత్రము అన్ని మతాలలోను విశేషమైన చిహ్నమే! ఇది భగవంతుడి చైతన్యానికి, సత్యానికి ప్రతీక, మధ్యలో వున్న అగ్నిసూర్య వుపాసకులైన జొరాస్ట్రియన్ మతాన్ని సూచిస్తుంది. ఇంకా చిహ్నంలోని చంద్రుడు, సూర్యుడు, ఆకాశము, సముద్రం సర్వమతస్థులు ఆరాధిస్తారు. కారణం అవి విశ్వవ్యాపితమైన మైనందువలన.

❖❖❖❖❖

- నిజానికి సామూహికంగా నాలుగు వందల సత్యాన్వేషకులు కలసి మౌనంగా ధ్యానంలో వుండడమనే దృశ్యం ఒక అత్యద్భుత దివ్య దర్శనం. స్వామి ఓంకార్‌జీ వారి "మౌన యజ్ఞం" శాంతిని కోరే సాధకులందరికి సహకరించుగాక!

**- స్వామి చిన్మయానంద**

# నవీన శిబి చక్రవర్తి



శిబి చక్రవర్తి అంటారు, "నేను రాజ్యమును కోరను, స్వర్గమును కోరను, జన్మ రాహిత్యమును కోరను, దుఃఖ సంతప్త ప్రాణుల దుఃఖ నాశనమే కోరెదను". పరమ విష్ణు భక్తుడైన శిబి చక్రవర్తి కేవలం తనను ఆశ్రయించిన పావురమును డేగ బారినుండి రక్షించుట కొరకు తన మాంసాన్నే దానం చేసెను. అంతేకాకుండా డేగ కూడా ఆహారం లేక మరణిస్తే తన భార్య, బిడ్డలు అనాధలవుతారు, కావున తనకు ఆహారాన్ని ఇవ్వమని శిబిచక్రవర్తిని అర్థిస్తుంది. ఈ విధంగా పావురం, డేగ ఇద్దరి యొక్క దుఃఖాన్ని బాపటానికి శిబిచక్రవర్తి తన శరీరాన్నే అర్పించెను!

స్వామీజీ ఒకసారి వాల్తేరు ఆశ్రమంలో వుండగా, నిర్మల అనే 5 సం॥ల బాలికను చేతుల మీద మోసుకుంటూ ఒక దంపతులు వచ్చిరి. "బాలికకు ప్రమాదంలో కాలు విరిగిపోయినదని, నొప్పితో బాధపడుతున్నదని, డాక్టర్లు చిన్న ఎముకముక్కను కలిపి ఆపరేషన్ చేయాలని అంటున్నారు. ఎముక దానం ఎవ్వరిని అడిగినా కాదంటున్నారు. మరి తనకు కుటుంబం



పెద్దదైనందున ఆ భారం మోసేవాళ్ళు లేరని, తను అన్ని రోజులు మంచంలో పడుకుంటే కుటుంబం జరగదని" వాపోయెను ఆ బాలిక తండ్రి. వెంటనే స్వామీజీ ఆశ్రమంలో ఎవ్వరికీ చెప్పకుండా, ఆ దంపతులతో నేను నిర్మలకు ఎముక దానం చేస్తాను ఏర్పాట్లు చేసుకొనమనెను. అదేదో ఊరట కలిగించడం కోసం స్వామీజీ అన్నారని ఆ దంపతులు ఆ విషయాన్ని అంతటితో వదిలేశారు. కాని తర్వాత స్వామీజీ యే స్వయంగా వారిని కలుసుకొని శస్త్ర చికిత్సకు తగిన ఏర్పాట్లు చేయమని ఒత్తిడి చేయసాగిరి. ఈ విషయం తెలిసి ఆశ్రమ భక్తులు వ్యతిరేకించినా స్వామీజీ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. 30-8-1950వ సం॥లో స్వామీజీ కింగ్‌జార్జ్ హాస్పటల్, విశాఖలో నిర్మలకు 8 అంగుళాల ఎడమకాలు ఎముకను దానం చేసేరు. స్వామీజీ జీవితంలో ఇది ఒక అపురూపమైన ఘటనగా వర్ణిస్తారు. శస్త్రచికిత్స సమయంలో నొప్పి తెలియకుండా వుండటంకోసం ఒక మత్తు సూది వేసారేమో! అంతేగాని జరుగుతున్నదంతా కళ్ళకు కట్టినట్లు తెలుస్తోంది స్వామీజీకి. కేవలం ఓంకారనాదం ఉచ్చరిస్తూ, జరిగిన చికిత్సకు సాక్షీభూతంగా నిలిచారు. భగవంతుడు ఆ పసి బాలిక దుఃఖాన్ని తీర్చడం కోసం నాకు గొప్ప అవకాశాన్ని ఇచ్చాడని స్వామీజీ శస్త్రచికిత్స తర్వాత చెప్పారు. కట్టువేసిన కాలుతో అపుడు స్వామీజీ కైలాసగిరిలో వున్నారు. అదే సమయంలో మౌనంగా కూడా వున్నారు. ఆ సమయంలోనే స్వామీజీ సాహిత్యంలో మరొక విశేషమైన పుస్తకం "ఆధ్యాత్మిక మెఋపులు" వ్రాశారు. తర్వాత కాలంలో నిర్మల తల్లిదండ్రులు శాంతి ఆశ్రమానికి జీవితాంతం పోషకులుగా వున్నారు. నిర్మల తండ్రి ఉప-అధ్యక్షులుగా కూడా ఆశ్రమానికి సేవచేశారు. నాటి బాలిక నిర్మల నేటికి కూడా ఆశ్రమ సందర్శన కోసం క్రమం తప్పకుండా వస్తున్నారు.

❖❖❖❖❖

# సాధన - మౌనం మరియు ఉపవాసం

స్వామీజీ 1950-1956 వరకు విశాఖపట్నంలోని కైలాసగిరిలో 6 సం॥ల పాటు మౌనంగా వున్నారు. దాని ఫలితంగా మాతృ ఆశ్రమం, ఇతర శాఖలే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా శాంతి ఆశ్రమ పని ఎంతో అభివృద్ధి చెందినది అని స్వామీజీ చెప్పినారు. ఆ సమయంలో "మౌనపు ఘడియలు" అనే పుస్తకాన్ని ఆయన వ్రాసిరి. అలాగే ఆయన జీవితకాలంలో 40 రోజుల ఉపవాస వ్రతం ఎన్నోసార్లు చేపట్టారు. మౌనం, ఉపవాసం వలన మనస్సు పవిత్రం అవుతుంది, ఉల్లాసం పెరుగుతుంది, ఆనందం పెరుగుతుంది. తద్వారా ఇతరులకు సేవ అధికముగా చేయవచ్చు అనేది స్వామి ఓంకార్ అభిప్రాయము. ఆ సమయంలో "ఆనందానికి ఉపవాసం" అనే వ్యాసం కూడా వ్రాశారు.

❖❖❖❖❖



శ్రీమతి సరస్వతీ దేవి గారు, చిక్కవరం జమీందారిణి



# రాజ వంశస్తుల స్పందన

పిఠాపురం మహారాజుగారు, ఆయన భార్య పిల్లలతోపాటు అమెరికాలోని హాలీవుడ్ దర్శించెను. అదే సమయంలో స్వామి ఓంకార్ హాలీవుడ్‌లో శాంతి కేంద్రమును స్థాపించెను. అది తెలుసుకొన్న రాజుగారు కుటుంబ సమేతంగా శాంతి కేంద్రాన్ని దర్శించి స్వామీజీ సందేశంతో ప్రేరితులయ్యెను. భారతదేశం తిరిగి వచ్చిన తర్వాత, చిన్నమాంబ రాణిగారు సోదరి సుశీలాదేవిని ఎంతో ఆదరించేవారు. మరియు వారి ఇరువురు కుమారులు ఆశ్రమానికి ఎంతో సేవచేసిరి. యువరాజు రాజకుమార్ సూర్యారావ్ బహదూర్ ఆశ్రమంలో ఒక భాగమై కొన్నాళ్ళు ఆశ్రమ అధ్యక్షులుగా కూడా పనిచేశారు. ఆయన చిరంజీవి జ్ఞానేశ్వరిని ఎంతగానో ప్రేమించేవారు.

లక్ష్మీనరసాపురం యొక్క రాణిగారు మరియు వారి కుటుంబ సభ్యులు శాంతి ఆశ్రమంను ఎంతగానో ఆదరించెను. అలాగే విజయనగరం మహారాణి శ్రీమతి విద్యావతి దేవిగారు వాల్తేరు ఆశ్రమ ప్రారంభ దశలో ధన సహాయం చేసెను. విజయనగరం రాజుగారు కైలాసగిరి ఆశ్రమ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడినారు. అలాగే బొబ్బిలి రాణిగారు శ్రీమతి లక్ష్మీసుభద్రాదేవికూడా ఆశ్రమానికి ఎంతో సన్నిహితంగా వుండేవారు. వారి సోదరి సరస్వతి దేవిగారు చిక్కవరం జమీందారిణిగా వుండేవారు. ఆమె వీణ చాలా చక్కగా వాయించేవారు. అంతేకాకుండా శాంతి ఆశ్రమానికి చాలా సన్నిహితంగా వుండేవారు. జీవిత ధర్మకర్త మరియు కమిటీ సభ్యులుగా కూడా వున్నారు. ఈమె స్వామీజీ నిర్యాణం తర్వాత గురువుగారి పార్థివ శరీరానికి వీడ్కోలు ఇవ్వడానికి వచ్చి, ఆ సమయంలో ఆధ్యాత్మిక దివ్యానుభూతిని పొందిన శిష్యురాలు, భాగ్యురాలు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే బొబ్బిలి మహారాజుగారు, యువరాజుగారు ఆశ్రమాన్ని ఎప్పుడూ సందర్శించలేదు. కాని ఎంతో ప్రేమపూరిత ఉత్తరాలు వ్రాస్తూ ఆశ్రమానికి ఎన్నో మంచి పనులు చేశారు. కాని వారి మనుమళ్ళు, మనుమరాళ్ళకు అందరికి శాంతి ఆశ్రమము వారి సొంత ఆధ్యాత్మిక గృహం అయినది.

❖❖❖❖❖

# సోదరి జ్ఞానేశ్వరి

అమ్మాజీ, శాంతి అని ఇద్దరు బాలికలు తోటపల్లిలోని శాంతి ఆశ్రమమునకు వచ్చిరి. వీరు ఓంకార్ స్వామియొక్క దూరపు బంధువుల పిల్లలు. వీరి ప్రాథమిక విద్యాభ్యాసం ఆశ్రమంలోనే పూర్తిఅయినది. వచ్చినప్పటి నుండి ఇరువురు స్వామీజీకి చేదోడు వాదోడుగా వుండేవారు. అమ్మాజీకి జ్ఞానేశ్వరి అని స్వామీజీ నామకరణం చేశారు. ఆమె మొదటి నుండి భక్తి, ప్రేమ, విధేయత, నిస్వార్థత అనే గుణ సంపద కలిగి వుండేవారు. ఆమె 13-10-1931వ సం॥లో జన్మించారు. ఆమె కుటుంబ సభ్యులు అందరు భగవంతుని యందు భక్తి ప్రవృత్తులే సంపదగా భావించేవారు.

కుమారి జ్ఞానేశ్వరి చిన్నదయినా నీటికి బాతు ఎగిసినట్లు ఆశ్రమ కార్యకలాపాలన్నింటిలో ఉత్సాహంతో, తన్మయతతో పాల్గొనుట ప్రారంభించినది. ఆ విధంగా ఆమె జీవితాన్ని ఆశ్రమానికి అంకితం చేసుకొన్నది. ఆమెది పసివాని అమాయకత్వం మంచు బిందువు పరిశుభ్రత, గొర్రె పిల్లకంటే సాధువు. ఆశ్రమ వాసులందరిని నిండు హృదయంతో, ప్రేమించుట, శక్తి వంచనలేక సేవించుట ఆమె పరమధ్యేయం. ఆశ్రమంలో ప్రతి పనిలోను ఆమె భాగం వుండేది. పిల్లల సంరక్షణ, అతిథులసేవ ఉత్తర ప్రత్యుత్తరాలు, తెలుగు, ఆంగ్లంలో టైపు చేయడం, సామాన్య ప్రాథమిక







విద్యకూడా పొందదానికి అవకాశం లేని సమయంలో ఆశ్రమానికి వచ్చిన ఆమె పని నైపుణ్యం చూస్తే పూర్వ జన్మలలో నేర్చిన విద్యలను ఈ జన్మలో నెమరువేసుకొంటుందా అని అనిపించేదట. ఇన్ని పనుల మధ్య ప్రతిరోజు రాట్నంపై నూలు వడకుట, వయోలిన్‌పై సంగీతం సాధన చేయుటకు కూడా కాలాన్ని వినియోగించేది.

అంతేకాకుండా మధ్యలో చుట్టుప్రక్కల గ్రామాలకు వెళ్ళి పేదలను, రోగులను కలసి, మందులు ఇచ్చి అనునయ వాక్యాలు పలికేది. స్వామి ఓంకార్ అంటారు, 12 ఏండ్ల ప్రాయంలో మరణించిన తన చెల్లిలే మళ్ళీ జ్ఞానేశ్వరి రూపంలో జన్మించినది అని. ఆమె ఎంతో విలువైన ఈ జీవితాన్ని ప్రతిక్షణం సద్వినియోగం చేసుకోవాలనే తపన కలిగి వుండేవారు. ఆమెకు మూగ జంతువులపైన కూడ ఎంతో దయ, వాత్సల్యం వుండేది. విష కీటకాలు, పాములు, తేళ్ళు మొదలగునవి తారసపడితే, వాటిని చంపనీయక, వాటిదారిన అవిపోతాయిలే అనేది.

సోదరి జ్ఞానేశ్వరిలో విశేషము ఏమిటంటే తన స్వేచ్ఛ, ముక్తికంటే ఇతరులకు సేవలు అందించాలనే దీక్ష ఆమెలో ఎక్కువగా వుండేది. ఆమె నిస్వార్ధ సేవకు. పరోపకారానికి ఒక చిన్న సంఘటన ఇక్కడ ఉదహరిద్దాం! డా॥ సికె. ప్రసాద్‌రావు గారు అని మద్రాసు జనరల్ హాస్పిటల్ యొక్క పూర్వ అధ్యక్షులు. వీరు ఆధ్యాత్మిక సాధన కోసం ఆశ్రమం వచ్చివున్నారు. రాత్రి 7 గం॥ల సమయంలో ఆయనకు భోజనం అందివ్వడానికి జ్ఞానేశ్వరి వెళ్లెను. అది చిమ్మచీకటి, పైగా వర్షం పడుతోంది. దారిలో ఏదో కాలుకు కుట్టినట్లు అనిపించింది. అయినా తన కర్తవ్య నిష్ఠ వలన డాక్టరుగారు భోజనం చేసేంతసేపు వుండి, తర్వాత మళ్ళీ ఆ పాత్రలు తీసుకొని స్వామీజీ దగ్గరకు వచ్చెను. జరిగిన విషయం చెప్పి కాళ్ళకు నీళ్ళివ్వమని అడిగెను. అంతలోపలే నోరుచేదుగా వుందని, మొద్దుబారుతోందని పలుకుతూ స్పృహకోల్పోయెను. జ్ఞానేశ్వరిని రక్షించుకోవడానికి ఎవరి ప్రయత్నాలు వాళ్లు చేస్తున్నారు. డా॥ ప్రసాద్‌రావుగారిని పిలిపిస్తుంటే, ఆయన ధ్యాన, మౌనాలకు భంగం కలిగించ వద్దని సైగచేసింది సోదరి జ్ఞానేశ్వరి అంతటి విపత్కర పరిస్థితిలో కూడా. తర్వాత డాక్టరు గారు వచ్చి తన అపారమైన అనుభవంతో ప్రకృతి చికిత్స, ఆయుర్వేద చికిత్స చేసెను. భగవంతుడి దయ వలన జ్ఞానేశ్వరి ఆపాయం నుండి బయటపడెను. కాని అంత వేదనలోను, అక్కడున్న వారందరిని వెళ్ళి విశ్రాంతి తీసుకోండి తనకేమి పర్వాలేదు అనెను.

సోదరి జ్ఞానేశ్వరి గురుభక్తికి, సాధనా తత్పరతకు మరొక చిన్న ఉదాహరణ. స్వామి ఓంకార్ 6 సం॥ కైలాస ఆశ్రయంలో మౌనంలో



వున్నప్పుడు, ప్రతి రోజు క్రింద నుండి భోజనం, అవసరమైన వస్తువులు తీసుకొని కైలాసగిరికి వెళ్ళేది ఎండైనా, వానైనా! అంతేకాకుండా అక్కడకు పోయిన తర్వాత స్వామీజీతోపాటు నిశ్చల ధ్యానంలో నిమగ్నమైపోయేవారు. స్వామీజీ ధ్యానం నుండి విరమించేంత వరకు ఓపికగా అక్కడ వుండేవారు. స్వామీజీ అనేవారు. "పక్షిలాగ ఎగురుకుంటూ వచ్చి, ధ్యాన నిష్ఠలో కూర్చొన్న జ్ఞానేశ్వరిని చూస్తే హృదయం పరవశిస్తుంది".

అందరూ సి ఫర్ కాట్, డి ఫర్ డాగ్ అని అంగ్లపాఠాలు నేర్చుకుంటే, సోదరి జ్ఞానేశ్వరి తన గురువుగారి నుండి భగవంతుడు, పవిత్రత, ప్రేమ, సేవ, పని, కోరిక, తృప్తి, సంతోషము, శక్తి, శాంతి, మౌనము మరియు స్వర్గము అనేపాఠాలు నేర్చుకొనెను. వీటిని వివరిస్తూ "నేను ఆంగ్లము ఎలా నేర్చుకున్నాను?" అన్న పుస్తకం వ్రాశారు పిల్లలకోసం.

తన అంతర్యామి సందేశము ననుసరించి, ఈ చిన్ని జ్ఞానేశ్వరి తన తర్వాత శాంతి ఆశ్రమానికి పీఠాధిపతి అని స్వామి ఓంకార్ విల్లువ్రాసెను. కారణం ఆమె గుణసంపదలో తనకు శిష్యురాలు, గురువు, బిడ్డ, చెల్లెలు అన్నీను అంటారు స్వామి ఓంకార్. అందువలనే ఆయన శరీర త్యాగం తర్వాత ఆశ్రమ బాధ్యత అంతా జ్ఞానేశ్వరి మాతాజీ స్వీకరించారు. స్వామీజీ ఆశయాలకనుగుణంగా ఆశ్రమం మాతాజీ నేతృత్వంలో దినదినాభివృద్ధి చెందుతోంది.

స్వామీజీ నిర్యాణము చెంది ఇప్పటికి 33 సం॥రాలు గడిచిపోయినాయి. జ్ఞానేశ్వరి మాతాజీ గారి నిరంతర కఠోర పరిశ్రమతో, నిస్వార్థ సేవ, నిష్కామ కర్మాచరణతో, భక్తి జ్ఞాన తత్పరతతో భక్తుల సహాయ సహకారములతో శాంతి ఆశ్రమం వంద సంవత్సరాలు పూర్తి చేసుకోబోతోంది మాతాజీగారి సమక్షంలో...

❖ ❖ ❖ ❖ ❖

# షష్టిపూర్తి

1956వ సంవత్సరంలో జనవరి 21 నుండి 31వ తేది వరకు స్వామి ఓంకార్ షష్టిపూర్తి మహోత్సవాలు భక్తులు గొప్పగా జరుపుకున్నారు. "స్వామి మరణించెను ఓంకారం మాత్రమే సజీవంగా వుంది" అని అంటారు స్వామి ఓంకార్. కాబట్టి ఇలాంటి ఉత్సవాలు లోకకళ్యాణం కోసమే జరుపబడతాయి. ఈ సందర్భంగా ఆశ్రమంలో పెద్ద ఎత్తున అన్నదానం, వస్త్రదానం, అఖండ నామ సంకీర్తనం, భజనలు, హరికథలు, బుర్ర కథలు యజ్ఞాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఎందరో మహాత్ములు, సన్యాసులు, విద్యావంతులు, పామరులు ఆ కార్యక్రమాలల్లో పాల్గొనిరి. కోటి ప్రతిపూజ కూడా జరిగెను.

❖ ❖ ❖ ❖ ❖

# తోటపల్లి కొండల రాక్‌ఫెల్లర్

రాక్‌ఫెల్లర్ అనే ఆయన అమెరికా దేశస్తుడు. అమెరికా దేశంలోని అతి ధనవంతులలో ఆయన ఒకరు, ధనవంతుడే కాదు గొప్ప దాతకూడ. ఆయన దానం కేవలం మిలియన్ల డాలర్లలో చేసేవాడు. చర్చిల నిర్మాణం, ప్రపంచ శాంతి కొరకు దానం చేశారు. స్వామీజీ అంటారు, "నేను తోటపల్లి కొండలకు మాత్రమే కాదు ప్రపంచానికే రాక్‌ఫెల్లర్‌ని, రాక్‌ఫెల్లర్ లాగ మిలియన్ డాలర్లు లేకపోయినా, అనంతమైన ప్రేమ, త్యాగభావం కలిగి వున్నాను యావత్ మానవాళి పట్ల". అందుకే స్వామీజీ మనకు కూడ పిలుపునిస్తున్నారు! భగవంతుడికై తపించడం, ఇతరులకు సేవచేయడం వలన మనం కూడా ఆధ్యాత్మిక కోటీశ్వరులం అవుతాము!

❖ ❖ ❖ ❖ ❖



# ఆదర్శ గురుకులానికి బీజం



స్వామి ఓంకార్ హిమాలయాలలోని వేర్వేరు గురుకులాలను సందర్శించినపుడు, విశేషంగా ఆయన స్వర్గాశ్రమంలో వున్నపుడు ఆ బాలురను చూస్తున్నపుడు ఋషి కుమారుల వలె అనిపించేవారు. ఇలాంటి గురుకులం తోటపల్లి కొండలలో కూడ వుంటే ఎంతబాగుండును అన్న సంకల్పం స్వామీజీకి కలిగెను. ఆ బాలుర వేద మంత్రాల పఠనము, సమిధులు వేరుకొని వచ్చి హోమాలు చేయుట, భజనలు, ప్రార్థనలు చేయుట చూచుటకు ఎంతో ముగ్ధమనోహరంగా వుండేది.

స్వామీజీ తిరిగి వచ్చేటప్పుడు స్వర్గాశ్రమం నుండి నలుగురు బాలురను కూడ వెంటపెట్టుకొని వచ్చెను తోటపల్లెకు. తోటపల్లి కొండల్లో నలుగురు బాలురతో గురుకులానికి నాంది పలికిరి. తర్వాత వాల్తేరులో కూడా ప్రారంభించిరి. కాని స్వామీజీకి వయస్సు తక్కువై అనుభవం లేకపోవడం, ఆర్థిక నిధులు సమకూరకపోవడం, సంస్కారవంతులైన అధ్యాపకులు లభించకపోవడం వంటి కారణాల వలన గురుకులం తాత్కాలికంగా మూతపడెను.

తర్వాత 1954వ సం॥లో తోటపల్లి కొండలలోను, తర్వాత వాల్తేరులో 1974 వ సంవత్సరంలో చెవిటి, మూగ పిల్లలకు ఒక పాఠశాల, 1966 వ సం॥లో ప్రాథమిక పాఠశాల, మరియు కోటగిరిలో 1980 వ సం॥లో మెట్రిక్యులేషన్ పాఠశాల ప్రారంభించబడి, ఇప్పటికి చక్కగా దినదినాభి వృద్ధిగాంచుతున్నాయి.

విద్య అంటే కేవలం చదవడం, వ్రాయడం అంక గణితం నేర్చుకోవడం మాత్రమే కాదు. ఆత్మ విద్యకూడా నేర్చుకొని, అందరి శ్రేయస్సు కోసం నిస్వార్థంగా జీవించుట విద్యార్థి దశలోనే నేర్పడమే పాఠశాల స్థాపన వుద్దేశ్యం. “నిజమైన విద్య పుస్తకాలకు పరిమితం అవ్వడం కాదు, ఎన్ని పుస్తకాలు అధ్యయనం చేశామనీ కాదు, అందరినీ అర్థం చేసుకోవడంలో, ప్రేమించడంలో మన హృదయాలను ఎంత విశాలము చేసుకున్నాము అన్నదే ముఖ్యం” అనేవారు స్వామీజీ.

❖ ❖ ❖ ❖ ❖

- స్వామి ఓంకార్ ప్రవచనం ఆది నుండి అంతం వరకు ఆత్మ నివేదనా గీతంలాగ వుంది.

**– శ్రీ ఎడ్గర్టన్**

(అప్పటి అమెరికా అధ్యక్ష పదవి అభ్యర్థి)



# ఆశ్రమం చెట్లు – రక్త మాంసాలతో పోలిక



స్వామి ఓంకార్ తోటపల్లి ఆశ్రమంలో చెట్లు స్వయంగా నాటి, వాటి సంరక్షణ కూడ స్వయంగా చేసేవారు. కారణం తన రక్త, మాంసముగా వాటిని భావించేవారు. స్వామీజీ అనేవారు ఆ చెట్లకు నీళ్ళు పోయకపోయినా, ఎరువు వేయక పోయినా అవి తనతో మొరపెట్టుకుంటున్నాయని. అందుకే స్వామీజీ బయట నుండి వచ్చి ఆశ్రమంలోకి అడుగు పెట్టితే చివరికి చెట్లుకూడ మిక్కిలి ఆనందంగా వుండేవి. ప్రింటింగ్ ఆఫీసు దగ్గర ఒక నారింజ చెట్టు నిండా కాయలు వున్నపుడు పురుగు పట్టివాడను ప్రారంభించెను. స్వామీజీ వ్యవసాయ అధికారిని కూడ పిలిపించి, చివరి వరకు దాన్ని బ్రతికించాలని ఎంతో ప్రయత్నం చేశారు. కాని చివరికి ఆ చెట్టు మరణించెను!

కొన్ని చెట్లైతే ఎంత అశ్రద్ధ చేసినా మొండిగా బ్రతికి వుండేవట, మా స్వామీజీ రాకపోతారా, మమ్మల్ని ఆదరించక పోతారా అన్నట్లు! అందుకే స్వామీజీ బయటనుండి వచ్చిన వెంటనే చెట్లకు నీళ్ళు పెట్టడం, ఎదిగిన



కొమ్మల్ని కొట్టివేయడం చేసేవారు. కొమ్మల్ని కొడుతుంటే బాధ కలిగేదట, అయినా చెట్టు యొక్క ఎదుగుదల కోసం తప్పదు కదా అనుకురేవారట! చెట్టు యొక్క శాఖలను కొట్టేటప్పుడు ముందుగా వాటికి క్షమాపణ చెప్పి తర్వాత కొట్టేవారట. అయినా వాటికి బాధ కలగకుండా పూరట కలిగించడం కోసం నరికిన భాగాన చల్లటి పేడ లేద మట్టిని వుంచేవారట.

❖❖❖❖❖

*Searched for 'The Masters of the East' and found one in Swami Omkar.*

**-Dr. Jacques Weiss** (Noted French Writer)



# సేవా కార్యక్రమాలు




శాంతి ఆశ్రమం ప్రారంభించినపుడు, చుట్టు ప్రక్కల గ్రామస్థులు చాలా అమాయకులు, నిరక్షరాస్యులు. వీర్ని పల్లెల్లో ధనికులూ, జమిందారులూ మానవులుగా కాక నీచాతి నీచంగా చూస్తూ తమ ధనదాహంతో ప్రజల్ని అణగద్రొక్కేవారు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అన్నట్లు, వాళ్ళు ఓంకార్ స్వామిని ఆశ్రయించేవారు. సర్వసంగపరిత్యాగి, సన్యాసి అయివున్నా ఆ నిరపరాధుల దుఃఖాన్ని మాపడానికి స్వామి ఎంతో కృషిచేశారు సమస్యలు వచ్చినపుడు నేరుగా సాక్ష్యాధారాలతో పోలీస్ సూపరిండెంట్, డిప్యూటీ కలెక్టర్ దగ్గరకు వెళ్ళి మాట్లాడి చివరికి పేదలకు న్యాయం కలిగేట్లు చేసేవారు. అలా అనుకోకుండా బీదలకు, అనాధలకు స్నేహితుడు, ధనికులకు, జమీందారులకు శత్రువు అయ్యారు స్వామి ఓంకార్.

మాతృ ఆశ్రయంలో వైద్యశాల, ముద్రణాలయం, గ్రంథాలయం, పశువుల వైద్యశాల, తపాలా సౌకర్యం, వృద్ధుల ఆదరణ కేంద్రం, రహదారి నిర్మాణం, స్పిరిచ్యువల్ హీలింగ్ సెంటరు, స్వామి రామతీర్థ శాంతి

శిక్షణాలయం, మొదలగు సేవాకార్యక్రమములు నెలకొల్పబడెను.

తునిలో హరిజనుల సేవకోసం శాంతి ఆశ్రమ శాఖ ప్రారంభించ బడెను. ఒకసారి 60 మంది హరిజనులు తుని నుండి 40 మైళ్ళు నడచి భజనలు, నామ సంకీర్తనలు చేసుకుంటూ మాతృఆశ్రమం సందర్శించిరి. స్వామీజీ స్వయంగా హరిజన వాడలో వారి సామాజిక, ఆధ్యాత్మిక అభివృద్ధి కోసం తరగతులు నిర్వహించేవారు.

విశాఖపట్నంలో ప్రభుత్వ ఆహ్వానంపైన జైలులోని ఖైదీలకు శాంతి ప్రార్థన, సందేశాలు అందించేవారు ఖైదీలు ఎంత ప్రభావితులు అయ్యారంటే చివరికి కొందరు తమ నంబరుతోపాటు శాంతి ప్రార్థన మెడలో తగిలించుకోవడం, మరి కొందరు గదిలో గోడకు అంటించుకోవడం చేశేవారు. వాల్తేరు ఆశ్రమంలో సోదరి సుశీల వైద్యసహాయము చేయుట చూచి డా॥ఎమ్.జి. కిన్నీ, డా॥దినకర్‌రావు, డా॥కె. ప్రసాద్‌రావు, డా॥రామమూర్తిగారు వంటి గొప్ప వైద్యులు ముందుకు వచ్చి ఆశ్రమంలో వైద్యకేంద్రం ప్రారంభించారు. మిగిలిన మిత్రులు, భక్తులు ఇతర సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఋషికొండ దేవాలయం పునరుద్ధరణ చేశారు.





దసరాకు జాలరుల గ్రామాలకు వెళ్ళి వారికి నచ్చజెప్పి జంతు బలిని నిలిపి వారిచేత యజ్ఞం చేయించారు.

**శాంతి ప్రచార యాత్ర - తమిళనాడులోని, కోటగిరి:** సహోదరి సుశీలాదేవి జ్ఞాపకార్థముగా లభించిన “సుశీలా శాంతి వ్యాను”లో 1958వ సంవత్సరములో తోటపల్లి నుండి కోటగిరికి ఒక శాంతి యాత్ర నిర్వహించబడెను. అందులో స్వామీజీతోపాటు సంగీతం మాస్టారు, ఆరుగురు గురుకుల విద్యార్థులు, ఇతరులు కలిసి మొత్తం 12 మంది పాల్గొనిరి. మొత్తం 40 దినాల ప్రయాణంలో 22 పబ్లిక్ మీటింగ్‌లు (సమావేశాలు) భక్తులు గృహాలలో, పూతోటలలో 34 సమావేశములు జరిగెను. దారి పొడవునా శాంతి ప్రార్థన, భజనలు చేసుకుంటూ సాగెను. కరపత్రాలు పంచబడెను. దాదాపు 1000 మైళ్ళ దూరం ప్రయాణంలో భగవంతుడిదయ వలన ఎందరో హృదయాలలో శాంతి బీజాలు నాటబడెను.

**ఉత్తరాదికి (ఉత్తర భారతదేశానికి) శాంతి జైత్రయాత్ర:** 1960వ సంవత్సరములో తోటపల్లి నుండి ఋషీకేశ్ వరకు సుశీల శాంతి వ్యానులో సాగిన ఈ యాత్రలో స్వామీజీతోపాటు, స్వామి గురువానందజీ, కుమారి జ్ఞానేశ్వరి మాతాజీ, సంగీతం మాస్టారు, గురుకుల విద్యార్థులు మరియు ఇతరులు పాల్గొనిరి. వాను డ్రైవరుకు అనారోగ్యం కలిగినపుడు లక్నో, డిల్లీ, కలకత్తా వంటి జనసందోహమైన నగరాలలో మన రాజాజీ వాను నడిపిన తీరు అద్భుతం అంటారు స్వామీజీ. ఈ బృందంలోని అత్యంత చిన్న వయస్సు 9 సంవత్సరముల చంటి, సత్యకుమార్‌ను స్వామీజీ అంటారు, ఈ చిన్నబాలుడు చేత పట్టిన “శాంతి పతాకము” వలన మేము సారనాథ్, హిమాలయాలకు వెళ్ళి మరలా తోటపల్లికి రాగలిగాము అని.

మొత్తం 5000 మైళ్ళ ప్రయాణం, 72 దినములు, 72 క్షణముల వలె గడచిపోయెను అంటారు స్వామీజీ. దారి పొడవునా వేలమంది భక్తులకు శాంతి ప్రార్థన ఎంతో ప్రేరణ ఇచ్చెను. దారి పొడవునా ఎన్నో ఆధ్యాత్మిక అనుభవాలు లభించెను. లక్నో, ఢిల్లీ, కలకత్తా వంటి జన సమృద్ధి నగరాల గుండా కూడా ప్రయాణం సాగెను. ఎందరో మహాత్ములు, యోగులు, ఆశ్రమాలు, మఠ వాసులు అందరూ ఈ యాత్రలో పాల్గొనిరి. కాలేజీలు,

పాఠశాలలు, ఆశ్రమాలు మార్కెట్ స్థలాలు మరియు గుడులు ఏ ప్రదేశం అయినా, సమావేశాలు మాత్రం విజయవంతం అయ్యేవి భగవంతుని కృప వలన. లోకశాంతి ప్రార్థన ఆయా ప్రాంతీయ భాషలలోనికి అనువదించి అందరికీ పంచబడేది. స్వామి శివానందజీ అనారోగ్యంగా వున్నా, ఎంతో అభిమానంతో అందరి బాగోగులు విచారిస్తూ విశేషమైన ఆశీర్వాదాలు మా అందరికీ అందించారు అని అంటారు, స్వామీ ఓంకార్.

**"మానవ సేవయే మాధవ సేవ"**

**ఓం! ఓం! ఓం!**

ఎవరి హృదయంలో ప్రేమ వుంటుందో అక్కడ భగవంతుడు వుంటాడు. ప్రతి ఒక్కరి హృదయంలోను శాంతి ప్రతిష్ఠిస్తే అది విశ్వశాంతికి దారితీస్తుంది. స్వామీజీ తన పుట్టిన రోజు నాడు మౌనం, ధ్యానం, ఉపవాసం వుండేవారు. ప్రపంచంలోని ప్రతిదేశము ద్వేషము, వైషమ్యంతో యుద్ధ కలహాలతో రగులుతున్నపుడు స్వామి ఓంకార్ యొక్క సందేశము అయిన పరస్పర ఐక్యమత్యము, ప్రేమ, శాంతి, జాతీయతకు కూడ అతీతంగా విశ్వమానవ సౌభ్రాతృత్వం, విశ్వప్రేమ, దివ్యప్రేమ వంటివి ఆ కాలంలో ప్రపంచం అంతట శాంతిని కాంక్షించేవారిని ఏకత్రితం చేసింది. శాంతి ప్రతి యొక్కరి యొక్క జన్మహక్కు.

నేటి అసూయ, వినాశనము, యుద్ధములు, మారణహోమాలకు కారణం కేవలం విశ్వవ్యాప్తమైన భగవంతుడ్ని మరచిపోవడమే. కాబట్టి భగవంతుడ్ని అంతటా చూడగలిగితే విశ్వశాంతి లభ్యమవుతుంది. గాంధీగారి విశ్వప్రేమ, సత్యాన్వేషణ మానవాళికి ఆయువుపట్టు అని స్వామి ఓంకార్ అనేవారు. గాంధీజీగారి సత్యము, అహింస ఓంకార్ స్వామి జీవితంలో జీర్ణించుకొని పోయాయి. గాంధీజీ గారి హరిజన నిధికోసం, స్వామీజీ కూడ ఎంతో కృషిచేసి, శాంతి ఆశ్రమ పోషణకు వచ్చిన నిధిని హరిజన నిధి కోసం పంపేవారు. అనేక దేశాల నుండి ఎందరో శాంతిని కాంక్షించేవారు. శాంతి ఆశ్రమమును సందర్శించారు, కొందరైతే కొన్నాళ్ళు శాంతి ఆశ్రమంలో నివశించారు కూడా.

గాంధీజీగారి లాగా అందరూ కనీసం వారానికి ఒక్క రోజైన మౌనం



పాటించాలి. లేదంటే కనీసం నెలకు ఒక రోజు లేదా సంవత్సరానికి ఒక రోజైన మౌనం పాటిస్తే మంచిది అంటారు స్వామి ఓంకార్ మౌనమును గురించి.

1964వ సం॥లో స్వామి ఓంకార్‌కు హృద్రోగం ప్రారంభం అయ్యెను. ఆయన భగవత్ సన్నిధి కోసం ఎప్పుడో తయారయ్యారు. "స్వామి మరణించెను. ఓంకారము మీ అందరిలో సజీవంగా వున్నది". ఆయన ఆశ్రమాస్తులు కూడ ఏదీ తన పేరు మీద వ్రాయనివ్వలేదు. అంతా కమిటీ పేరు మీదనే వ్రాయించారు. కనీసం కమిటీలో కూడా తన పేరు వ్రాయలేదు. సాక్షీభూతంగానే పనిచేశారు ఆశ్రమం కోసం.

స్వామీజీ తన జీవితంలో చిన్న ప్రాయంలోనే తల్లిని కోల్పోయారు. మాతృ ప్రేమకు నోచుకోలేదు. కాని తండ్రే తల్లిగా కూడా పెంచారు. కాని ఆ తర్వాత భగవత్ సేవా మార్గంలో లెక్కలేనంత మంది తల్లిదండ్రులు లభించారు స్వామీజీకి. అందులో కొందర్ని మాత్రమే ఇక్కడ వ్రాస్తున్నాం. సోదరి శ్రీమతి రెడ్నం వెంకాయమ్మ – ఆమె భర్త, మాతృశ్రీ రత్నమ్మ – కక్కిరాల రామారావు మాతృశ్రీ కమలాదేవి – శ్రీ ఆనందరావు, మాతృశ్రీ మరియా (సరస్వతిదేవి) – శ్రీ రాల్ఫ్ ఎంట్రికన్ (సూర్యానంద), శ్రీమతి జేన్‌లిల్లీ (శాంతి దేవి), శ్రీమతి ఇ.బి. హొగన్ (జగదంబ), శ్రీమతి మిడ్రెడ్ షేవార్ట్ (జ్ఞానదేవి), శ్రీమతి బెట్టీ ఫ్రాస్టర్, శ్రీమతి ఇమ్‌గార్డ్ జార్గా షహల్జ్ (గంగామాయి), శ్రీ అల్బర్ట్ మోల్‌దేన్‌హార్ (వ్యాస), శ్రీమతి డా॥ఫ్రిషోలం, మాతృశ్రీ రుస్తోన్‌జీ, మాతృశ్రీ అన్నపూర్ణమ్మ, మాతృశ్రీ లలితాదేవి (లులు విల్డింగ్), శ్రీమతి లక్ష్మీసుభద్రాదేవి, శ్రీమతి సరస్వతిదేవి, దాదా టి.ఎల్.వాస్వానిజీ మరియు జె.పి.వాస్వానిజీ మొదలగు వారు.

స్వామి రామతీర్థ, స్వామి ఓంకార్‌కు ఆత్మ, లక్ష్యము మరియు ఆదర్శము. అందుకే ఆయన పేరుతో స్వామి రామతీర్థ శాంతి శిక్షణాలయము పూజ్యశ్రీ వినోభాబావేజీ ఆశీర్వాదంతో 1967వ సం॥లో శ్రీ శాంతి ఆశ్రమ స్వర్ణోత్సవాల సందర్భముగా సర్వోదయ నాయకుడు శ్రీ జయప్రకాశ్ నారాయణ్ గారు మాతృ ఆశ్రమంలో ప్రారంభించిరి.

ప్రభుత్వం వారు, స్వామి రామతీర్థ దేహాన్ని ఏ ప్రదేశంలో (టెహ్రీ,

గర్వాల్ జిల్లా, హిమాయములు) అయితే గంగామాత తనలో కలుపుకున్నదో, అక్కడ "స్వామి రామతీర్థ పిల్లర్ ఆఫ్‌లైట్" అని ఒక స్థూపాన్ని నిర్మించి దాని ప్రారంభోత్సవానికి 20-6-1968వ సం॥లో స్వామి ఓంకార్‌ను ఆహ్వానించిరి. ఈ ఆహ్వానాన్ని తన జీవితంలో ఒక అపురూపమైన ఘటనగా పేర్కొన్నారు స్వామీజీ. అదే సమయంలో చివరి సారిగా మరొక్కసారి బదిరీనారాయణుడి దర్శనం కూడా స్వామీజీ చేసికొనిరి. ఆ సమయంలో అత్యున్నతమైన ఆధ్యాత్మిక అనుభూతి స్వామీజీకి కలిగెను.

> ప్రపంచం అంతా అల్లకల్లోలము, అశాంతితో నిండి, ఆధ్యాత్మిక విలువలు పూర్తిగా లోపించి వున్న ఈ సమయంలో, భగవత్ ద్రష్ట స్వామి ఓంకార్ యొక్క సాన్నిధ్యము, సందేశము వివిధ దేశస్థుల మధ్య ఉన్న అజ్ఞానాంధకారాన్ని, భేదభావాలను నశింపజేయును.
>
> -స్వామి రామదాస్, ఆనందాశ్రమం (1964)



# శాంతి దూత అంతిమయాత్ర

పూజ్యశ్రీ ఓంకార్ స్వామీజీ 88వ జన్మదినం 21-1-1982న పూజ్య శ్రీ చిదానంద స్వామి అధ్యక్షతన వందలాది భక్తుల సమక్షంలో ఆనందప్రదంగా జరిగెను. శ్రీ తెన్నేటి విశ్వనాధంగారు పరమపదించిన తర్వాత శాంతి ఆశ్రమమునకు గౌరవ అధ్యక్షులుగా వుండుటకు శ్రీ చిదానందస్వామి అంగీకరించిరి. అందువలన ఓంకార్ స్వామి ఎంతో ఆనందంతో, తృప్తితో తమ చివరి రోజులు గడుపుచున్నారు.

శాంతి ఆశ్రమం స్థాపించుటలో మరియు వృద్ధిపరుచుటలో వారి స్వశక్తిని ధారబోసి 64 సం॥లుగా పాటుపడిరి. వారి హృదయము ఎంత విశాలమో వారి ఆశ్రమ స్థాపన కూడ అంత విశాలమైనది. వాటి శాఖలు కూడా విశాలముగా అభివృద్ధిగాంచుచునే వున్నాయి. కాని స్వామీజీ మాత్రం ఏ ఆశ్రమ తాపత్రయములు లేకుండా నిర్లిప్తముగ, విలక్షణముగ వారి చివరి రోజులలో వున్నారు. ఇంతకు ముందు ఆశ్రమ భక్తులతో ఆశ్రమ అభివృద్ధికి తోడ్పడమని కోరేవారు. కాని గత 3,4 సం॥లుగా స్వామీజీ ఆ కోరికను కూడా త్యజించారు. ఓంకారము మీ అందరిలో జీవించుచుండెనన్న మహాభావనలోనే, ఏదో ప్రపంచంలో జీవిస్తున్నట్లు వుండేవారు.

అలా మార్చినెల ప్రారంభ అయ్యెను. కోటగిరి ప్రయాణం దగ్గర పడుచుండెను. ఈలోగా వాల్తేరు ఆశ్రమమునకు వెళ్ళిరావాలని మార్చి 5వ తేదీన బయలుదేరారు. అచట ఉదయం సాయంత్రం భక్తులకు దర్శనం ఇస్తూ సాయంత్రం సత్సంగంలో పాల్గొంటున్నారు. "మీరు వెదకుచున్న దైవము మీతోనే వుండెను. కాలము అమూల్యమైనది. ఈ రోజే మనది, రేపు మనది కాదు. కావున నిరంతరం దైవ జ్ఞప్తితో వుండి మీ మానవజన్మను సార్ధకం జేసుకొనుదురుగాక" అని క్లుప్తంగా పలికి మౌనం వహించెడివారు. అలా రెండు నెలలు అక్కడ గడిపిన తర్వాత కాస్త అస్వస్థత కలిగెను. అయినా స్వామీజీ కోటగిరికి వెళ్ళాలని సంకల్పించారు. డాక్టరుగారు అస్వస్థతను గుర్తుచేస్తున్నా స్వామీజీ నిర్ణయం మార్చుకోలేదు. భక్తులు స్వామీజీ ఆరోగ్యాన్ని గురించి విచారిస్తే "మీ అందరకు సేవచేసి, మీకు తోడ్పడగలిగిన అదే నా ఆరోగ్యం" అనేవారు.

ఏప్రిల్ 30వ తేదిన వాల్తేరు నుండి తోటపల్లి కొండలు మాతృ ఆశ్రమమునకు వచ్చిరి. మరల మే 15వ తేదీన కోటగిరికి బయలుదేరిరి. వారి మనస్సంతా కోటగిరి భక్తుల సేవను చూచి తరించాలని వువ్విళ్ళూరుతున్నది. ఇక వారి అనారోగ్యాన్ని గురించి ప్రస్తావించే సాహసం ఎవ్వరికీ లేకపోయినది. దారిలో కాకినాడ, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, గుడివాడ, గుంటూరు రైల్వేస్టేషన్‌లలో భక్తులు స్వామీజీని దర్శించి ఆశీర్వాదములు పొందిరి. విజయవాడ శాంతి సత్సంగ మండలి భక్తులకు, "మీ వంటి భక్తుల కొరకై నేను జీవించుచుంటిని. మీరు చేయుచున్న అపార సేవకు చాలా ఆనందం మనకు వున్నదానిని యితరులతో పంచుకొనుటలోనే మనకు నిజమైన శాంతి, ఆనందం కల్గును. ఇతరుల సుఖశాంతులే మన సుఖశాంతులు అన్న సత్యమును మీ జీవితములలో వ్యక్తపరచుటలో సార్థకం చేసుకొందురు గాక! నా ప్రార్థనలు సదా మీ వృద్ధినే కోరుచుండును" అని సందేశము ఇచ్చిరి.

మద్రాసు మీదుగా మే 17వ తేది కోటగిరికి స్వామీజీ చేరుకున్నారు. కారు దిగిన తర్వాత ఎంతో ఉత్సాహంగా ప్రార్థనా మందిరంలో భక్తులతో మాట్లాడారు. "మీ అపారమైన ప్రేమ, భక్తే నన్ను యిచ్చటకు తీసుకొని వచ్చినది. నేను యిచ్చట వున్నందులకు మీ అందరు ఇదివరటికన్నా యిప్పుడు ఇంకా వృద్ధి చెందుచూ, మీరు దైవంలో జీవించుచు, యితరులకు కూడా ఆ దైవసన్నిధిలో జీవించుటకు తోడ్పడవలయును. ఈ క్షణమే మనది. వచ్చెడి క్షణం మనదికాదు, దైవాజ్ఞ లేనిదే గడ్డిపరక కూడా కదలదు. ఆ దైవాజ్ఞచేతనే నేను యిచ్చటకు రాగలిగితిని. ఈ సత్యమును మీరు గ్రహించి తరించెదరుగాక!"

కోటగిరిలో కూడా వివిధ ప్రాంతాల నుండి భక్తులు స్వామీజీ సన్నిధిలో కొన్నిరోజులు గడిపి తరించి వెళ్ళుతున్నారు. ఈ విధంగా 10,12 రోజులు గడిచినవి. తర్వాత స్వామీజీకి కొంచెము జ్వరము తగిలినట్లు అనిపించింది. క్రమంగా ఆహారం తీసుకోవడం తగ్గించేశారు. రోజులు గడిచే కొద్ది ఆరోగ్యంలో మెరుగు కనిపించట్లేదు. కోటగిరి భక్తులు రాత్రి, పగలు స్వామీజీ వెన్నంటి వుండి సేవచేస్తున్నారు. కోయంబత్తూరు తీసుకెళ్ళితే బాగుండును



అని ఆలోచిస్తుండెను. స్వామీజీ మాత్రం ఏదో సమాధిస్థితిలో ప్రశాంతంగా వున్నట్లు అనిపించెను. వారి ముఖంలో దివ్య తేజస్సు నిండివున్నది. అయినా భక్తులు వుండబట్టలేక ప్రాణాలను కాపాడుకోవాలనే తాపత్రయంతో కోయంబత్తూర్ శ్రీరామకృష్ణ ఆసుపత్రిలో చేర్పించిరి. ఇక మాతృ ఆశ్రమం చేరుట మంచిదని భక్తులు నిర్ణయించుకొని 10-6-1982వ తేదిన మధ్యాహ్నం 12 గం॥ సమయంలో డాక్టరు గారితో సహా భక్తులు వ్యాన్‌లో స్వామీజీని పరుండబెట్టిరి. ఆసుపత్రి విడిచి వ్యాను సుమారు 18 మైళ్ళ ప్రయాణంచేశాక డాక్టరు గారు సందేహం కలిగి వ్యాన్ ఆపమనిరి. స్వామీజీ శిరస్సు మీద చేయి వుంచి, నారాయణా! అనిరి. ఎపుడో స్వామీజీ పవిత్ర ఆత్మ ఈ సువిశాలమైన ప్రకృతిలో లీనమైపోయినది. 12వ తేది ఉదయం స్వామీజీ అంతిమ దర్శనం కోసం తోటపల్లిలో వందలాది భక్తులు దుఃఖ సాగరములో మునిగి వున్నారు. దైవస్మరణతో, భగవద్గీత పారాయణాలతో, భాగవత, రామాయణ శ్లోకాలతో నిర్యాణ మందిరము మారుమ్రోగెను. శ్రీ స్వామీజీ అంత్యదర్శనమునకై వచ్చిన చిక్కవరం జమిందారిని శ్రీమతి సరస్వతీ దేవిగారు, గురుభక్తితో స్వామీజీ పాదాలు అభిషేకించారు. ఆమెకు కలిగిన దివ్యానుభూతిని భక్తులకు స్పష్టపరిచిరి. మధ్యాహ్నం 2 గం॥లకు స్వామీజీ భౌతిక కాయమునకు అగ్ని సంస్కారములు జరిగెను. వారి భౌతిక



కాయం 3 రోజులున్నను యోగనిద్రలో వున్నట్లు, తేజస్సు నిండి, ప్రశాంతంగా వుండెను. వారి ఆత్మజ్యోతి, విశ్వాత్మలో లీనమైపోయెను.

స్వామి ఓంకార్ ఆశ్రమమునకుగాని, దేశమునకు గాని కట్టుబడియుండలేదు. ఈ విశాలమైన ప్రపంచమే వారి గృహము, ప్రపంచంలో వున్న జనులందరూ నా సోదర సోదరీమణులనియు, చివరి శ్వాస వరకు సేవచేయుచునే ప్రాణము వదల వలెననెడి వారి వాక్యములకు సజీవ సాక్షిగా వుండి, ఆ విధంగానే ఆఖరి శ్వాస వరకూ సేవచేయుచునే పవిత్రదేహమును వదలిరి.

ఓం! ఓం!! ఓం!!!

❖❖❖❖❖





# ముగింపు ప్రార్థన

ఓం నమస్తే సతేతే జగత్కారణాయ
నమస్తే చితే సర్వలోకాశ్రయాయ
నమో అద్వైత తత్వాయ ముక్త ప్రదాయ
నమో బ్రహ్మణే వ్యాపినే శాశ్వతాయ

పృథివీ శాన్తిః। అన్తరిక్షం శాన్తిః। ద్యౌః శాన్తిః ఆపః శాన్తిః
ఔషధయః శాన్తిః। వనస్పతయః శాన్తిః। విశ్వేమే దేవాః శాన్తి।
బ్రహ్మం శాన్తిః। శాన్తిః శాన్తిః శాన్తిః

జ్ఞాతం జ్ఞాతవ్య మధునా
ద్రష్టం ద్రష్టవ్య మద్భుతం
చిరం శ్రాంతః విశ్రాంతోస్మి
చిన్మాత్రా నాస్థి కించన

అహం బ్రహ్మాస్మి మంత్రోయం కోటిపాపం వినాశ్యతే
అహం బ్రహ్మాస్మి మంత్రోయం జ్ఞానాన పాపం వినాశ్యతే
అహం బ్రహ్మాస్మి మంత్రోయం బుద్ధి పాపం వినాశ్యతే
అహం బ్రహ్మాస్మి మంత్రోయం జ్ఞానానందం ప్రాయశ్చిత్తే

ఓం పూర్ణ మదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే
పూర్ణస్వ పూర్ణమాదాయః పూర్ణమేవా వశిష్యతే
హరిః ఓమ్ శాన్తిః శాన్తిః శ్శాన్తిః

❖❖❖❖❖

# స్వామి ఓంకార్‌కు ప్రేరణ ఇచ్చిన కథలు

## 1. సంపూర్ణ శరణాగతి

పసిబిడ్డ ఎంతసేపు తన బొమ్మలతో ఆడుకుంటూ ఉంటుందో అంతసేపు తల్లి తన ఇంటి పనులలో నిమగ్నమై వుంటుంది. ఎప్పుడైతే బిడ్డ బొమ్మల్ని వదిలేసి తల్లికోసం ఏడుస్తుందో అపుడు ఆ తల్లి ఆ పనినంతా వదిలేసి బిడ్డని ఒడిలోకి తీసుకుంటుంది. భగవంతుడు కూడ ఆ తల్లిలాగనే!

వైకుంఠంలో ఒకసారి శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవి చదరంగం ఆడుకుంటున్నారు. శ్రీ మహావిష్ణువు హఠాత్తుగా ఒక్క ఉదుటున లేచి, వేగంగా భూలోకం వైపు ప్రయాణం సాగించెను. కాని మార్గం మధ్యలోనే వెను తిరిగెను వైకుంఠమునకు. లక్ష్మీదేవి ఆశ్చర్యంతో శ్రీ విష్ణుమూర్తిని, "ఏమి జరిగినది? అంత అత్యవసరంగా బయలుదేరి వెళ్ళి, వెంటనే తిరిగి వచ్చేశారు" అని ప్రశ్నించెను. అందుకు విష్ణుమూర్తి, "నా భక్తుడొకరు భూలోకంలో సమస్యలతో సతమతమవుతుంటే రక్షిస్తామని వెళ్ళాను. కాని అంతలోనే అతడు తన ప్రయత్నం తానుచేసుకోవడం చూచి, నా అవసరం లేదని వెనక్కి తిరిగాను" అని సమాధానము ఇచ్చెను.

నీతి : – భగవంతుడ్ని పూర్తిగా నమ్మితే, ఆయనే మన పూర్తి సంరక్షణ వహిస్తాడు.

## 2. కౌపీన సంరక్షణార్థం అయమ్ పటాటోపమ్

ఒకానొక అడవి ప్రాంతంలో ఒక సాధువు హాయిగా, ప్రశాంతంగా ధ్యానము చేసుకుంటూ జీవిస్తూ వుండెను. అపుడు ఆయనకు వున్న ఆస్తి రెండు కౌపీనాలు మాత్రమే. ఒకటి ధరిస్తే, మరొకటి ఉతికి ఆరవేశేవాడు. చిట్టెలుక ఒకటి, రోజూ అరవేసిన ఆ కౌపీనాన్ని కొరికి రంధ్రాలు చేయడం ప్రారంభించెను. సాధువు ప్రతి రోజు క్రొత్త కౌపీనం కోసం ప్రక్కనున్న గ్రామానికి వెళ్ళి అర్థించవలసి వచ్చెను. అందుకు గ్రామస్థులు సాధువుకు ఒక సలహా ఇచ్చిరి. ఆ ఎలుకను పట్టుకోవడం కోసం ఒక పిల్లిని పెంచమనిరి. ఈ సలహా ఏదో బాగానే వుందని సాధువు పిల్లిని పెంచడం ప్రారంభించారు. మరి పిల్లికి పాలు కావాలి కదా! మరల ప్రతిరోజు గ్రామస్థులను పిల్లికి పాలు కావాలని అర్థించసాగెను. మరల ఆ పరమభక్తులు పిల్లికోసమే కాదు మీకు కూడా పాలు లభిస్తాయి. కావున ఒక ఆవును పెంచమనిరి. మరి ఆవుకు మేత, పచ్చిక, గడ్డి కావాలి కదా! మరల గ్రామస్థుల దగ్గరకు వెళ్ళితే వారు సలహా ఇచ్చారు. సాధువుగారు మీ ఆశ్రమము చుట్టూ నిరుపయోగంగా బోలెడంత భూమి పడివున్నది. అందులో కాస్త భూమిని సాగుచేసుకుంటే మీకు ఇంక ఏ కొరత వుండదు అని. ఇదేదో ఇంకా మంచి సలహాగా వుందని సంతోషపడి, కూలీలను వేసి వ్యవసాయము ప్రారంభించెను. ఆవుల సంఖ్య, కూలీల సంఖ్య మెల్ల మెల్లగా పెరగసాగెను. ఆవులకు కొట్టాలు, ధాన్యాన్ని నిల్వవుంచడానికి గిడ్డంగులు, కూలీలు నివసించడానికి గృహాలు కావాల్సి వచ్చెను. సాధువు తనకు తెలియకుండానే గృహస్థుడు కూడా అయ్యెను. రెండు కౌపీనాలు సంరక్షించుకోవడం కోసం సాధువు చివరికి పెద్ద భూస్వామి అయ్యెను. చివరికి కాసేపు భగవంతుడ్ని ప్రార్థించను కూడ సమయం లభించక పోయెను. కొన్నేండ్ల తర్వాత ఆ సాధువు యొక్క గురువుగారు తన శిష్యుడి ఆధ్యాత్మిక సాధన తెలుసుకోవాలని వెతుక్కుంటూ వచ్చెను. ఆ తపోభూమిలో వెలసిన ఆ మహాసౌధాలు, పంట పొలాలను చూచి ఆశ్చర్యపడి గ్రామస్థులను ప్రశ్నించెను, ఆ సాధువు ఎక్కడికి వెళ్ళిపోయెను అని. తర్వాత గురువు గారు సాధు శిష్యుడ్ని గుర్తించెను. అంతట ఆ శిష్యుడు గురువుగారికి సాష్టాంగ నమస్కారం చేసి క్షమించమని ప్రార్థించెను. చివరకు ఆ సాధువు కేవలం రెండు కౌపీనాలు సంరక్షించుకోవడం కోసం మాయలో పడి గృహస్థుడనయ్యి, క్లిష్ట పరిస్థితులలో ఇరుక్కుపోయాను అని దుఃఖించెను.

నీతి: ఆడంబరాలు ఆత్మదర్శన సాధనుకు ఆటంకాలు.

## 3. మనిషికి ఎంత భూమి కావాల్సి వస్తుంది? (కౌంట్ లియో టాల్‌స్టాయ్)

ఒకానొక వ్యక్తి భగవంతుడు తనకు ప్రసాదించిన భూమితో తృప్తిపడక, ఇంకా ఇంకా భూమి పొందవలెనని ఆశపడెను. తక్కువ ధరకు భూమిని కొని తర్వాత ఎక్కువ ధరపెట్టి అమ్ముతూ భూముల్ని పెంచుకుంటూ వుండెను.

విశాలమైన, కొలుచుటకు కూడ సాధ్యపడని ఈ భూమండలానికి అధిపతి అయిన ఒక ఆగంతకుడు ఒకసారి వచ్చి ఆ ఒకానొక వ్యక్తితో ఇట్లనెను. "నీవు ఒక్క పైసా కూడా చెల్లించనక్కరలేదు. నీకు ఎంత భూమి కావాలో అంతభూమి పొందవచ్చు" అనెను. ఆ దురాశాపరుడు పై మాటల పట్ల చాలా ఆకర్షితుడయ్యెను. తర్వాత తన భూములు అన్ని అమ్మివేసెను. ఆ భూమి ఇస్తానన్న ఆగంతకుడి దగ్గరకు వెళ్ళెను. అపుడు ఆ ఆగంతకుడు తాను చెప్పినట్లు ఎంత భూమి కావాలో అంతా ఇస్తానన్నాడు కాని ఒక షరతు పెట్టాడు. అదేంటంటే, "ప్రొద్దున తెల్లవారు ఝాము నుండి సాయంత్రం సూర్యాస్తమం వరకు నీవు ఎంత దూరం నడుస్తావో, ఆ భూమంతా నీకు దక్కుతుంది కాని, సూర్యాస్తమయానికి నీవు బయలుదేరిన స్థానానికి తిరిగి రావాలి" అని. ఆ దురాశాపరుడు షరతు ఇంతేకదా అని చాలా ఆనందంగా, సూర్యోదయ సమయం నుండి నడవడం ప్రారంభించాడు. మండే సూర్యున్ని కూడా లెక్కచేయకుండా తాను చాలా భూమిని పొందాలన్న పేరాశతో మునుముందుకు నడిచెను. అపుడు ఒక్కసారి చుట్టూ చూచెను. సూర్యుడు తనకు వెనుక భాగమున క్రిందికి దిగుతున్నాడు. అపుడు వేగంగా వెనక్కి, ప్రొద్దున తాను బయలుదేరిన స్థానానికి తిరిగి చేరడానికి నడక ప్రారంభించెను. సమయం అయిపోతున్నదని వేగంగా నడిచాడు. తర్వాత పరుగెత్త నారంభించాడు. సూర్యుడు అస్తమించబోతున్నాడు. తన బలాన్నంతా కూడగట్టుకొని పరిగెత్తనారంభించాడు, చివరికి గమ్యాన్ని చేరుకున్నాడు. కాని ఏమి ప్రయోజనం పాపం! ఆ దురాశాపరుడు దప్పికతో నీరసంతో క్రింద పడి చనిపోయాడు. కొన్ని వందల ఎకరాల భూమిని పొందాడు, కాని చివరికి ప్రాణాలనే కోల్పోయాడు! చివరికి ఆ దురాశాపరుడికి సమాధిచేయడానికి 6 అడుగుల భూమి మాత్రమే అవసరము అయినది.

నీతి: దురాశ వినాశనానికి దారి తీస్తుంది.

## 4. కోర్కెలేకపోవడం

ఒక కౌపీనదారియైన సాధువు సూర్యోదయ సమయంలో ఆనందంగా చలిని కాచుకుంటూ ఒక బండరాయిపైన కూర్చొండి వుండెను అదే



సమయమున ఆ దారిలో వజ్రాలు పొదిగిన ఆభరణాలతో అలంకరించుకొని రాజు అలెక్జాండర్ ప్రయాణించు చుండెను. అంత సాధారణ జీవితాన్ని గడుపుతూ కూడ దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న ఆనందంతో జీవిస్తున్న ఆ కౌపీన ధారి సాధువును చూచి ఆశ్చర్యంతో కాస్త ఆగెను. ఆ రాజుగారు, "ఆభరణాలు, సంపద, అధికారం మొదలగునవి అన్ని ఇస్తాను మీరు మాతో మా రాజ్యమునకు రమ్ము" అని రాజుగారు సాధువును అర్థించెను. అందుకు ఆ సన్యాసి నవ్వుతూ తిరస్కరించెను. అవి అన్నీ తనలోనే వున్నాయని పలికెను. అలెక్జాండర్ గారికి గర్వభంగం కలిగి కోపంతో కత్తితీసి సాధువును చంపుతాను అనెను. రాజుగారి బెదిరింపుకు మరింత గట్టిగా నవ్వుతూ సాధువు ఇట్లనెను. "ఓరాజా! ఇంత కంటె గొప్ప అబద్ధం మీ జీవితంలో ఎపుడూ చెప్పి వుండరు కత్తి ఎలా నరుక గలదు, అగ్ని కాల్చగలదు, నీరు తడుప గలదు, వాయువు ఎండించ గలదు? చివరికి మరణం కూడా నన్ను అంటలేదు. నేను కేవలం శరీరాన్ని కాదు. ఆత్మను" అని సాధువు మరింతగా నవ్వసాగెను. రాజుగారు తన అజ్ఞానమును గుర్తించి కౌపీన ధారి అయిన సాధువుకు సాష్టాంగ నమస్కారం ఆచరించెను.

నీతి : రాజ్యాలను జయించడం కంటే కోర్కెలను జయించడం శ్రేష్టమైనది.

## 5. స్వావలంబన

ఒకానొక సమయంలో ఒక జంట పక్షులు తమ పిల్లలతోపాటు గూడు కట్టుకొని ఒక చెట్టుమీద నివసిస్తుండెను. దగ్గరలోనే ఒక వ్యవసాయి పంటను పండిస్తుండెను. ప్రతిరోజు ఈ పక్షులు ఆహారం కోసం వెళ్ళి సాయంత్రానికి పిల్ల పక్షులకు మేత తెస్తుండేవి. ఒక రోజు తల్లి పక్షులు గూటికి చేరగానే పిల్లపక్షులు కంగారుగా ఇట్లు పలికెను. "పంట పండించిన రైతు చెప్పుతుండగా విన్నాం. రేపు తన స్నేహితుల సహాయంతో పంటకోస్తారట" అందుకు తల్లి పక్షులు నవ్వి, "కంగారు పడవద్దు అతని స్నేహితులు ఎప్పటికీ రారు. పంటను కోయరు" అనెను. తర్వాత రోజు అలాగే జరిగెను. రెండవ రోజు అదేవిధంగా తల్లి పక్షులు గూటికి చేరగానే, "రేపు రైతు బంధువులను పంటకోయడానికి పిలిచెను" అనెను. మరల తల్లిపక్షులు అదే సమాధానం

పలికెను. భయపడవద్దు రైతు బంధువులు అతనికి సహాయం చేయరు అని. మూడవరోజు అదేవిధంగా పక్షిపిల్లలు పలికెను. 'రైతు గారి పిల్లలు వచ్చి రేపు పంట కోస్తారని రైతు పలికివెళ్లెను'. తెలివిగల తల్లిపక్షులు 'మనకు ఏమి చింతలేదు. రైతు పిల్లలు వచ్చిపంటకోసే ప్రసక్తే లేదు' అనెను. నాల్గవ రోజు పిల్లపక్షులు అనెను, తల్లి పక్షులతో – "రైతు ఎవ్వరినీ ఇంక నమ్మడంట రేపు తనే స్వయంగా పంట కోస్తానని పలికి వెళ్ళెను". అది విన్నవెంటనే తల్లి పక్షులు, పిల్లపక్షులను తీసుకొని మరో సురక్షితమైన పంట పొలం వైపు ఎగిరిపోయెను. రైతు చెప్పినట్లే తర్వాత రోజున తన పంటకోయడం ప్రారంభించెను.

నీతి: స్వశక్తిని నమ్ముకోవడమే కర్తవ్యం

## 6. భగవంతుడే దాత!

"కోరేదేదో భగవంతుడ్నే కోరు! ఆయనే అసలైన దాత". ఒకసారి ఒక సాధువు ఒక రాజు దగ్గరకు భిక్ష కోసం వచ్చెను. రాజుగారు సాధువును, "కాసేపు ఆగండి నాకు పూజ సమయం అయినది, పూర్తిచేసుకొని వస్తాను" అనెను. సాధువు రాజాస్థానములో కూర్చొని, రాజుగారి ప్రార్థనను ఆలకించసాగెను. "ఓ భగవంతుడా నాకు ఎక్కువ భూములు ఇవ్వు, ఎక్కువ సంపద ఇవ్వు, ఎక్కువ పిల్లలను ఇవ్వు." సాధువు ప్రశాంతంగా లేచి రాజాస్థానము వదలి వెళ్ళిపోయెను. రాజు తన పూజ పూర్తిచేసుకున్న తర్వాత సాధువు కోర్కెలు పరిశీలించడానికి వచ్చెను, కాని సాధువు వెళ్ళిపోయినందులకు ఆశ్చర్యపడి, దూతను పంపి సాధువును వెనక్కి పిలుచుకొని రమ్మనెను. తిరిగి వచ్చిన సాధువును రాజుగారు ప్రశ్నించెను. "ఓ సాధు మహాత్మా ! మీరు నిరీక్షించకుండా ఎందుకు వెళ్ళిపోయారు?" అందుకు సాధువు, "ఓరాజా! మీరు భగవంతుడి దగ్గర అనేక రకాలైన వాటికోసం యాచిస్తున్నారు, కాబట్టి భగవంతుడి ముందు మీరు కూడా ఒక భిక్షువే! యాచకుడ్ని ఎందుకు యాచించడం, అదేదో ఆ భగవంతుడినే నేరుగా యాచిస్తే సరిపోతుందని వెళ్ళిపోయాను" అనెను.

నీతి: రాజాశ్రయం కంటే భగవదాశ్రయం మేలు.



## 7. ప్రేమ మతం

పూర్వం ఒక పశ్చిమ దేశంలో ఒక ఋషి ఆడంబరము లేకుండా ప్రేమపూరితమైన, ప్రశాంతమైన జీవితం గడుపుతూ వుండేవారు. అల్లరి శిష్యుడొకరు, ఆ ఋషి దగ్గర శిష్యరికం చేసి సత్యాన్ని గ్రహించాలని వుర్వీళ్లూరెను. గురువుగారు ఎప్పుడూ మౌనంగా వుండేవారు. మిక్కిలి ప్రాథమిక దశలో వున్న శిష్యుడికి ఏమి అర్థం అయ్యేది కాదు. తనలోతానే తర్కించుకునే వాడు, తనస్థాయిలో ఇలా ఆలోచించేవాడు – తన గురువుగారు సోమరి అని, ఎల్లప్పుడూ ఎవ్వరికీ ఏమి నేర్పకుండా, ఉపదేశించకుండా సోమరిగా కాలం వెళ్ళబుచ్చుతూ ఏ ఒక్కరికీ వుపయోగపడకుండా వున్నారు అని.

ఒక రోజు శిష్యుడు గురువుగారిని ప్రశ్నించెను. "ఓ మహాత్మా! ఎంతో విద్యావంతులైన మీరు ఇలా ఏ పనిచేయకుండా మీ కాలాన్ని వృథాచేయడం నాకు కష్టాన్ని కలిగిస్తోంది. ఎందువలన మీరు ప్రజల్లోకి వెళ్ళి మీ పవిత్ర జ్ఞానాన్ని ప్రజలకు బోధించుట లేదు?" అని. ఋషి తన యువ శిష్యుడి సలహాకు నవ్వి, అతడికి ఒక పాఠం నేర్పాలని, "శిష్యా! అలాగే రేపు ప్రొద్దున్నే మనం ప్రజలందరకు సేవచేయడం కోసం అన్ని గ్రామాలూ వెళదాం" అనెను. శిష్యుడు మహదానంద పడిపోయెను. తర్వాత రోజు ఉదయం అనుకున్నట్లుగా ఇద్దరూ బయలుదేరిరి. వారు ఇరువురూ చాలాగ్రామాలు తిరిగారు, గ్రామాలలో వీధి వీధి తిరిగారు. గురువుగారు మౌనంగా ఎందర్నో ఆశీర్వదించారు. మార్గదర్శనం చేశారు కూడా. చివరికి తిరిగి తన శాంతి సామ్రాజ్యానికి వచ్చి చేరుకున్నారు, అసహనముతో అలమటిస్తున్న తన యువ శిష్యునితోపాటు!

శిష్యుడు కోపోద్రిక్తుడై, గురువు గారితో ఇట్లనెను "ఓ మహాత్మా! బహుశా మీ జీవితంలో మొదటిసారిగా మీ నివాసం నుండి కదలి బయటకు వచ్చారు. కాని ఒక్క వీధిలోను ఒక్క మనిషితోకూడ మీరు నోరు విప్పి ఒక్కమాట మాట్లాడలేదు. మౌనంగా తిరిగి వచ్చేశారు, ఏమి మనిషి మీరు" అని. ఋషి తన అజ్ఞానపు శిష్యుడి పట్ల సానుభూతితో అనెను, "బిడ్డా! ఈ రోజు దారి పొడవునా ప్రతి గ్రామంలో, ప్రతి వీధిగుండా మనం

ప్రయాణిస్తున్నపుడు దారంతా మన సందేశం వెదజల్లబడినది. అంతటా మనం శాంతిని ప్రసరింపచేశాము మౌనంగానే! అందరితో ప్రేమ పూర్వకంగా నవ్వాము. ఎందరితోనో పరస్పర శాంతి సందేశాలు ఇచ్చిపుచ్చుకున్నాము. మనం సందర్శించిన ప్రదేశం అంతా ప్రేమతో నిండిపోయినది. ప్రజలందరిని మనం ఆలింగనం చేసుకున్నాము. అనంత ప్రేమ అనే మతంతో. ప్రేమను ప్రకటించడానికి ఏవిధమైన బాహ్య ప్రకటనలు, మాటలు అవసరం లేదు"

నిజమైన ఉపదేశానికి బాహ్యాపరమైన మాటలు అవసరం లేదు, మౌనంతోనే వున్నతమైన బోధ జరుగుతుంది, అదే అసలైన బోధకూడ! ఆ గురువుగారి దయవలన యువ శిష్యుడికి ఆత్మబోధ కలిగెను. గురువుగారికి సాష్టాంగ ప్రణామంచేసి, తన తెలివి తక్కువ మాటలకు క్షమాపణ కోరి ప్రాయశ్చిత్తం చేసుకొనెను.

నీతి : "ఉరుముల, మెఱుపుల వంటి వార్తలకన్నా మౌనమే మిన్న"

## 8. మౌనోపదేశము

ఒక యువ గురువుగారు వుండెను. ఆయనకు వయస్సు 16 సం॥లు. ఆయనకు, 80 సం॥ శిష్యుడు వుండెను. ఆ శిష్యుడికి బోలెడన్ని సందేహాలు వుండేవి. అతను దేశమంతా తిరిగి ఎందరెందరి దగ్గరో తన సందేహాలకు సమాధానాలు వెతికారు కాని ఇప్పటి వరకు సంతృప్తి కలగలేదు. చివరికి అతని అదృష్టం ఆ యువ సన్యాసి దగ్గరకు చేరెను. గురువుగారు ఎపుడూ ధ్యాన నిష్ఠలో వుండేవారు. శిష్యుడు గురువుగారి ధ్యాన నిష్ఠ గమనించి తాను ఏ ప్రశ్న వేయక, గురువుగారి సన్నిధిలో మౌనంగా ధ్యానంలో కూర్చుండి పోయెను. ఆశ్చర్యంగా అతని ప్రశ్నలన్నియు మటుమాయ మయ్యెను. ఒక్క ప్రశ్న-సమాధానం జరగలేదు, ఏవిధమైన పలుకు లేదు కేవలం నిశ్చలమైన మౌనస్థితిలో గురువుగారి సన్నిధిలో, ఎన్నో ఏండ్లుగా పట్టిపీడిస్తున్న ప్రశ్నలన్ని తీరిపోయాయి. పవిత్రమైన మౌనంలో నిశ్శబ్దమైన మౌనంలో, కదలిక లేని దైవీ మౌనంలో కేవలం శాంతి వెలుగు, ప్రేమ మాత్రమే నిండి వుంటాయి.

నీతి: విశ్వజనీనమైన ప్రేమను అలవర్చుకోండి.



# ప్రఖ్యాత వ్యక్తులపై స్వామి ఓంకార్ యొక్క ప్రభావము

- **డా॥ సి.కె. ప్రసాద్ రావు** – వీరు మద్రాసు జనరల్ హాస్పిటల్ ప్రధానాధికారిగా వున్నారు. వీరు స్వామీజీ చిన్న వయస్సులో మొట్టమొదటగా ప్రారంభించిన సంస్థ "అకాడమీ ఆఫ్ రెలిజియన్స్" సభ్యులుగాను, తర్వాత వాల్తేరు ఆశ్రమ ప్రారంభదశలోను ప్రముఖ పాత్ర వహించారు.
- **శ్రీ తెన్నేటి విశ్వనాథం**– వీరు పార్లమెంట్ సభ్యులుగా ఢిల్లీలో పనిచేశారు. ప్రముఖ సాహితీవేత్తకూడ. వీరు కూడా "అకాడమి ఆఫ్ రెలిజియన్స్" సభ్యులుగాను, తర్వాత చివరికి శాంతి ఆశ్రమ అధ్యక్షులుగా కూడ సేవచేశారు.
- **శ్రీ అల్లూరి సీతారామరాజు** – వీరు బ్రిటీష్ ప్రభుత్వాన్ని గడగడలాడించి, మన్నెం వీరుడుగా ప్రసిద్ధిచెంది, చిరుప్రాయంలోనే భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణాలర్పించారు. వీరుకూడ "అకాడమి ఆఫ్ రెలిజియన్స్" సభ్యులుగా వుండి, విశాఖ సముద్రతీరంలో స్వామీజీతోపాటు ధ్యానము, సత్సంగంలో పాల్గొనేవారు.
- **శ్రీ ఓరిసన్ స్వెట్ మార్టెన్** – వీరు అధ్యాపకులు. అమెరికా మరియు ప్రపంచ వ్యాప్తంగా విఖ్యాత రచయిత.
- **శ్రీ ప్రభుదయాళ్ వర్మ** – వీరు రాజస్థాన్ బుందీ మహారాజ్ యొక్క కార్యదర్శి. స్వామీజీ ప్రభావంతో బుందీలో ఆశ్రమశాఖను ప్రారంభించిరి. మరియు శాంతి పత్రికను హిందీలో "విశ్వశాంతి కళ్యాణ్" అన్న పేరుతో ప్రచురించారు.
- **డా॥ వరాహగిరి వెంకటగిరి** – వీరు భారత రాష్ట్రపతిగా పనిచేశారు. స్వామీజీకి చిన్ననాటి మిత్రులు స్వామీజీ 16 ఏండ్ల ప్రాయంలో అమెరికా సమీపం వరకు వెళ్ళి, ప్రవేశం లభించక తిరుగు ప్రయాణంలో లండన్ మీదుగా భారతదేశము వచ్చెను. అపుడు లండన్‌లో న్యాయశాస్త్ర

విద్యార్థిగా వున్న వి.వి.గిరి గారు స్వామీజీకి వరహాలు (బంగారు నాణాలు) ఇచ్చి ధన సహాయం చేసిరి. అంతేకాక తర్వాత శ్రీ శాంతి ఆశ్రమ శాఖ కోటగిరిలో ప్రార్థనా మందిర ప్రారంభోత్సవమునకు 1966లో విచ్చేశారు.

- **మహంత్ శ్రీ ఆత్మ ప్రకాశ్** – వీరు ఋషికేష్ స్వర్గాశ్రమ అధ్యక్షులు. చిన్న వయస్కుడైన స్వామీజీ తపస్సు చేయుట గురించి ప్రారంభంలో శంకించినా, తర్వాత ఆయన మహత్యానికి ప్రేరితులై స్వామీజీ మీద విశేష గౌరవము, ఆధరాభిమానాలు కనబరిచారు.
- **శ్రీ కౌంట్ ఇలియా టాల్‌స్టాయ్** – వీరు ప్రఖ్యాత రష్యన్ రచయిత లియో టాల్‌స్టాయ్ యొక్క కుమారుడు. ఇతడు తన సతీసమేతంగా స్వామీజీని అమెరికా వెళ్ళినప్పుడు కలిశారు. ఎంతో ప్రేరణ పొందారు. ఆయన రచయితే కాక మంచి ఆధ్యాత్మికవేత్త కూడ.
- **శ్రీధనగోపాల్ ముఖర్జీ** – వీరు అమెరికాలో అప్పటి ప్రముఖులలో ఒకరు. గొప్ప ప్రవచకుడు, అధ్యాపకుడు, రచయిత, శ్రీరామకృష్ణ పరమహంస భక్తుడు. వయస్సులో చిన్నవాడైన స్వామీజీని కలిశాక ఎంతో ప్రేరేపితులయ్యి, విశేషంగా ఆయన్ని ప్రశంసిస్తూ ప్రోత్సహించారు.
- **డా॥ మర్రి చెన్నారెడ్డి** – వీరు రాజకీయాలలో పలు పదవులలో వుంటూ చివరికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కూడా వున్నారు. అప్పటి సామాజిక అశాంతి వాతావరణంలో ఓంకార్ స్వామి సమాజ శాంతికి చేస్తున్న సేవకు ప్రేరితులైనారు. స్వామీజీ కైలాసగిరిలో మౌనంలో వున్నపుడు కుటుంబ సమేతంగా వచ్చి స్వామి సన్నిధిలో నాలుగు రోజులు గడిపారు. అంతే కాకుండా కైలాసగిరి, మాతృ ఆశ్రమ అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించారు. ఆశ్రమ శాశ్వత పోషకులు కూడ.
- **శ్రీమతి రాజకుమారి అమృత్‌కౌర్** – వీరు అప్పటి ఆరోగ్య శాఖామంత్రిగా వున్నారు. గాంధీజీకి సన్నిహితులు. ఆశ్రమాన్ని సందర్శించడమే కాకుండా వారి చివరి దశవరకు ఆశ్రమానికి సన్నిహితులుగా వున్నారు.
- **డా॥ జ్ఞానానంద మహరాజ్** – వీరు గొప్ప ఆధ్యాత్మికవేత్త. హిమాలయాలలో గొప్ప తపస్సుచేసి, తర్వాత భగవత్ ప్రేరణతో విదేశాలకు వెళ్ళి, మరల ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మానవాళి ప్రగతికోసం అణుభౌతిక శాస్త్రంలో విశేష పరిశోధనలు, బోధచేస్తూ అధ్యక్షులుగా వుండేవారు. స్వామీజీ కైలాసగిరిలో మౌనంలో ఉన్నప్పుడు పలుమార్లు సందర్శించారు.
- **శ్రీ వినోబా భావే** – వీరు గాంధీజీ శిష్యులు. శాంతి ఆశ్రమం వాల్తేరులో చారిత్రాత్మకమైన ప్రసంగం ఇచ్చారు.

# సోదరి శాంతి



స్వామి ఓంకార్ లేదా శ్రీ శాంతి ఆశ్రమంతో మిక్కిలి అవినాభావ సంబంధం కలిగిన సోదరీమణులు సోదరి సుశీల, జ్ఞానేశ్వరి మాతాజీ మరియు సోదరి శాంతి. సోదరి శాంతి గురించి పరమపూజ్య స్వామి చిదానంద అంటారు. **"మౌనము మరియు శాంతి యొక్క ప్రతిరూపమే సోదరి శాంతి. అంతేకాదు స్వామి ఓంకార్ యొక్క సంరక్షక దేవత సోదరి శాంతి!"**

సోదరి శాంతి జననం 25-2-1934 వసం॥లో జరిగెను. ఆమె దాదాపు 40 సం॥లు స్వామీజీ మరియు ఆశ్రమ సేవకే తన జీవితాన్ని పరిపూర్ణంగా అర్పించినది. స్వామి ఓంకార్‌ను ఎంతో భక్తితో, నిష్టతో, ప్రేమతో మాతృ హృదయంతో సేవించినది. స్వామీజీకి సకలోపచారాలు అహోరాత్రులు చేస్తున్నపుడు ఆయన ఆత్మకథ యొక్క ప్రాముఖ్యతను గుర్తించి, ఎంత చనువుతో ఆత్మకథను త్వరగా పూర్తిచేయమని ఒత్తిడి చేసేది. ఆశ్రమ కార్యకలాపాల్లో జ్ఞానేశ్వరి మాతకు



కుడి భుజంగా నిలిచినది. పైకి ఆమె సున్నితంగా, మృదువుగా కనిపిస్తున్నా ఆశ్రమమునకు సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొనేటప్పుడు చాలా దృఢంగా, నిర్మొహమాటంగా వ్యవహరించేది.

"శాంతోయ మాత్మా" అంటే ఆత్మ యొక్క స్వరూపం శాంతి. దీనికి ప్రతీక సోదరి శాంతి. శాంతి బాలయోగినిగా భావింపబడినది. ఆశ్రమ భక్తుల భావాలలోను, హృదయాలలోను, స్వామి నిర్విషయానంద సోదరి శాంతిలో శ్రీరామకృష్ణ పరమహంస వారి సహధర్మచారిణి శ్రీ శారదామాతకున్న సల్లక్షణములు ఉన్నవని పలికెను. శ్రీ ఓంకార స్వాముల వారి ఆశయానుసారంగా ఆశ్రమ కార్యములు జరుపుటకామె శక్తులనన్నింటిని వినియోగపరచినది. ఓంకార స్వామి మహాసమాధి నొందిన తర్వాత, శాంతమ్మ ప్రేరణతో శ్రీ ఓంకార్ అష్టోత్తర శతనామములు, దండకము మరియు 108 సీస పద్యములతో శతకము శ్రీ స్వామి నిర్విషయానంద వ్రాసిరి. అవి ఆశ్రమ భక్తులకు ఒక అపురూపమైన కానుక అయ్యాయి. వెంటనే వాటిని అచ్చుకూడ వేయించినది.

శాంతమ్మ పూజ్య భావంతో ప్రతీకార్యం ఆచరించుచుండెడిది. ఇట్టి మంచి ప్రవర్తనలో అవ్యక్తంగా జీవితము గడుపుచున్న శాంతమ్మకు కేన్సరు వచ్చి శస్త్ర చికిత్స కూడ చేశారు. లోపల ఎంత బాధగా వున్నా, పైకి మాత్రం వ్యక్తం కాకుండా సేవాకార్యక్రమములందే నిమగ్నులై యుండెడిది. చివరికి 16.7.1986 నాడు ఆమె గురువు సాయుజ్యం పొందిరి. ఆమె ఓర్పు ఆశ్చర్యకరమైనది. ఆమె చివరి కాలంలో కేవలం ఒక్క నెలరోజులు మాత్రమే ఆశ్రమ భక్తులకు సేవచేయలేకపోయినది!

స్వామీజీ మూగజీవులను, పచ్చని మొక్కలను ఏవిధంగా చూచేవారో అదే విధముగా స్వామీజీ మందిరము చుట్టూ రకరకాల మొక్కలను పెంచుతూ కలుపుతీస్తూ, నీళ్ళుపోస్తూ చివరి రోజులు గడిపిన శాంతమ్మ ఆశ్రమంలోని అన్ని మొక్కలలోను కలిసిపోయి, శాంతి ఆశ్రమంలోనే వుండి సేవ చేస్తున్నది.

# విశ్వశాంతి గీతము

**- స్వామి ఓంకార్**

దివ్య సోదరభావమై
విశ్వశాంతి ధ్యేయమై
ఏకమూలమై ప్రవాహమై
అందరికీ ఒకే న్యాయమై
ఉంచేను ఏకలక్ష్యమై
కలిపేను అందరినీ ఒకే జీవమై
వెలిగేను విశ్వ ప్రేమమయమై
క్రోధ ఈర్ష ద్వేష భావాలు
అయ్యో! ఉంచాయి విడదీసి మనల నిన్నాళ్ళూ
ముగిసేను వాటి పాలనా ముచ్చట
జాతి, వర్గ, తెగ, కుల భేదాలు పోయాయి పోయాయి
సమసి పోయాయి.
గడిచిపోయిన స్వప్నంలో కలసిపోయి పొగమంచులా
అరే! ఇది స్వప్నమా! అని
మేలుకొన్న మానవుడు తెల్సుకున్నాడు కడకైనా

## శాంతి పాఠము

ఇక అనంతాకాశంలో, ఆపైన స్వర్గంలో
అన్ని జలాలపైన, ఉపరితలాలపైన
వెలయుగాక శాంతి వెల్లివిరుయుగాక
ఓషధులు మొక్కలు వృక్షాలు శాంతినే వెదజల్లుగాక
అంతరిక్ష గ్రహాలు వెలుగుగాక, శాంతి నిండిన
కాంతి వెదజల్లుగాక
ఇలపై శాంతి వెలయుగాక
ఎల్లెడల శాంతి, ఎల్లరకూ శాంతి

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు
ఓం ఓం ఓం



# శ్రీశాంతి ఆశ్రమం విశ్వశాంతి నిలయం

ఓహ్ ! రండి రండి శాంత్యాశ్రమానికి రారండి
ప్రేమకిది నిలయం విశ్వశాంతికిది ఆలయం
దర్శించినా, ఉన్నా మరి మౌనంగా ధ్యానించినా
అగుపించేను అంతర్గత అనంత సత్యము
విశాలమైన ముందువాకిలి, అందరికీ అందుబాటైన వసతి
చిన్న-పెద్ద, హెచ్చు-తగ్గు బేధమే లేక
అందిస్తున్నాం ఈ ఆహ్వానాన్ని
పూలతో పరిమళించే బృందావనం
ప్రేమనే వెదజల్లేను విరివిగా
కంటికింపైన గిరి శిఖరాలు
మరి నర్తించేను శాంతి నిండగా
పక్షులు పాడేను శ్రావ్యమైన సంగీతం
ముముక్షువులైన సాధువులు సంచరించేను
సత్యాన్ని మీతో పంచుకోడానికి
మనిషిని రుషిగా తీర్చిదిద్దడానికి
అందుకే రండి శాంత్యాశ్రమానికి
విశ్వశాంతిధామం ఈ శాంత్యాశ్రమం
వీధి వాకిలి తెరువబడి ఉంది ఎల్లప్పుడు
దగ్గర దూరపు మిత్రులందరికీ
పలికేను స్వాగతం సుస్వాగతం

**-సోదరి సుశీలాదేవి**

# శ్రీ శాంతి ఆశ్రమము - ఒక పరిచయం

పూజ్యశ్రీ ఓంకార స్వాములవారు తరుణప్రాయముననే సన్యసించి చాలా సంవత్సరములు హిమాలయములలో తపమాచరించి తపఃసిద్ధులై ఆంధ్రదేశము నకు తిరిగివచ్చి, తూర్పుగోదావరి జిల్లా, ప్రత్తిపాడు మండలమునందు తోటపల్లి కొండల మధ్యనున్న రమణీయమైన అరణ్యములో కొంతకాలము తపమాచరించిన పిమ్మట దైవప్రేరణచే 1917వ సంవత్సరంలో శాంతిఆశ్రమము ను స్థాపించిరి.

ఆనాటి నుండియు ఆశ్రమము దినదిన ప్రవర్ధమానమగుచు నేటికి సువిశాలమైన (100 ఎకరములు) ఫల, పుష్ప, వృక్ష సముదాయములతో నేత్రానందకరమై యొప్పుచు, అనేకమంది నిరాశ్రయులకు, అనాథ బాలబాలికలకు ఆశ్రయమై నిరంతరము అన్న, వస్త్ర, విద్య, వైద్య దానము లొనర్చుచు శాంతికాముకులకు, దైవపిపాసులకు ప్రశాంతి నిలయముగా అలరారుచున్నది. పూజ్యశ్రీ స్వామీజీ పవిత్రాశీస్సులతో "పీస్", "శాంతి" పత్రికల ద్వారా ఆధ్యాత్మిక సందేశములు అందించుచున్నది.

సర్వమత సామరస్యము, దీనజనోద్ధరణ, నిస్వార్థ, ప్రేమయుత సేవాజీవితము, ఆశ్రమము చూడవచ్చినవారిని దైవోన్ముఖముగా జేయుటయే - శ్రీ స్వామీజీ జీవిత ధ్యేయము.

జాతి, మత, కుల వివక్ష లేక సర్వులకు జ్ఞానగృహముగా నిరంతరాశ్రయ మిచ్చుటే శ్రీ శాంతి ఆశ్రమ లక్ష్యము.

ఈ మాతృ ఆశ్రమము వివిధ రీతుల అభివృద్ధినొందుటయే గాక వాల్తేరు, కాకినాడ, పిఠాపురం (ఆం॥ప్ర), కోటగిరి (తమిళనాడు) మొదలగు అనేక తావులలో ఈ ఆశ్రమ శాఖలు అభివృద్ధి చెందుతూ ఆయా ప్రాంతపు భక్తుల ఆధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడుచున్నది. దేశ, విదేశములందలి శాంతి కోరు భక్తులందరు మాతృ ఆశ్రమమును, శాఖలను దర్శించుచు, శాంతిని బడసి వెళ్ళుచుండిరి. ఇంతకుముందు దర్శించని భక్తులకు, ఆశ్రమమునకు, దైవసన్నిధికి హృదయ పూర్వక సుస్వాగతము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః



## శాంతిని పొందదలచిన సాధకులకు స్వాగతం పలుకుతోంది
## శ్రీ శాంతి ఆశ్రమము

**అత్యంత రమణీయమైన ప్రకృతి దృశ్యములతో**
**శ్రీశ్రీశ్రీ ఓంకారస్వామి వారి తపశ్శక్తితో**
**అతి ప్రశాంతమైన వాతావరణములో శ్రీ శాంతి ఆశ్రమము**
**శాంతి మార్గములో పయనించదలచిన వారికి స్వాగతం పలుకుతుంది.**

**సాధు, సజ్జనులకు, బీద బాలలకు, నిస్సహాయ వృద్ధులకు**
**భోజన, భాజన విద్యా వైద్య సదుపాయములు లభింపజేసి**
**వారి ఉన్నతికి తోడ్పడే శ్రీ శాంతి ఆశ్రమము**
**శాంతిని పంచిపెట్టదలచిన నిస్వార్థ సేవకులకు**
**స్వాగతం పలుకుతుంది.**

**హిందువులకు, ముస్లిములకు, క్రైస్తవులకు, బౌద్ధులకు**
**ఇంకా అన్ని ఇతర మతముల వారికి కూడా**
**వారి వారి విశ్వాసములకు, సిద్ధాంతములకు**
**భంగము కలుగని రీతిలో ప్రవర్తించే శ్రీ శాంతి ఆశ్రమము**

### శ్రీ శాంతి ఆశ్రమ ఆశయములు

- ॐ వ్యక్తి శాంతి ద్వారా విశ్వశాంతి స్థాపన
- ॐ ఉచ్ఛ్వాసనిశ్వాసలలో వ్యక్తి జన్మహక్కైన 'శాంతి'ని అనుభవింపజేయుట
- ॐ మానవ సేవయే మాధవుని సేవ
- ॐ మనము భగవంతునిలో జీవిస్తూ ఇతరులు కూడా 'భగవంతుని'లో జీవించునట్లు తోడ్పడుట
- ॐ లోకాస్సమస్తా స్సుఖినోభవంతు!

# తోటపల్లి శాంతి ఆశ్రమ విభాగములు

**జ్ఞానాశ్రమము :** సన్యాస ఆశ్రమ స్వీకారం చేసినవారు, ఏకాంతముగ, మౌనముగ తీవ్రయోగసాధనలు చేసుకొనుటకు వీలగు రెండు గుహలు.

**జనకాశ్రమము :** గృహస్థ జీవితాన్ని వదలి, వాన ప్రస్తాశ్రమాన్ని స్వీకరించి ప్రార్థనలు, ధ్యానాదులు సాగించుకుంటూ ఆధ్యాత్మిక జీవితం గడుపుటకు అనువైన ఏర్పాట్లు.

**మైత్రేయాశ్రమము :** స్త్రీలు ప్రత్యేకంగా ప్రార్థనలు, ధ్యానము మొదలగు ఆధ్యాత్మిక సాధనలు చేసుకొనుటకు.

**స్వామి రామతీర్థ ఇనిస్టిట్యూట్ :** జిజ్ఞాసువులకు ఆధ్యాత్మిక తరగతులు, సాధనా శిబిరములు నడుపు కేంద్రము. స్వామి ఓంకార్ జీవితము, సందేశము ఆధారంగా శాంతి చిత్రములతో కూడిన ప్రదర్శనము కలదు.

**శాంతి తపోవనము:** శివాలయమునకు సమీపంలో గుట్టపై దీర్ఘకాలం ప్రశాంతంగా ధ్యానము చేసుకొనుటకు.

**శాంతిపీఠము :** ప్రపంచశాంతికై శాంతి తరంగాలు ప్రసరింపచేయుటకు భక్తులతో శాంతి ప్రార్థన లిఖిత జపం చేయించి భద్రపరచు పీఠం.

**సుశీల హాస్పటల్ :** ఆశ్రమ వాసులకు, అతిధులకు, పరిసర గ్రామాలకు ఉపయోగపడు (Hospital) ఆసుపత్రి.

**స్పిరిచ్యువల్ హీలింగ్ సెంటర్ :** శారీరక మానసిక రోగాలకు ప్రార్థనల ద్వారా చికిత్సను చేకూర్చు ఆధ్యాత్మిక కేంద్రం. మరియు ప్రతి దినం విశ్వకల్యాణార్థం జపయజ్ఞం. వైదిక హవనం, పాదుకా పూజ జరుపబడుచున్నవి.

**పశువైద్యశాల :** ఆశ్రమం యొక్క పరిసర గ్రామాల వారి పశువులకు చికిత్స చేయును.

**శాంతి విద్యాలయం :** తోటపల్లి కొండలలో మొదటి గురుకుల పాఠశాల 1954 వ సం॥లో, మరియు ఉన్నత పాఠశాల 1981 వ సం॥లో ప్రారంభింప బడినవి. 150 బాలబాలికలకు ఉచిత భోజం, బస ఏర్పాట్లతో పాటు ఆధ్యాత్మిక ప్రాతిపదికపై సాధారణ విద్య బోధించబడుతున్నది.



**వృద్ధులకు శరణాలయం :** జాతి, మత, కుల ప్రాంతీయాది వివక్ష లేకుండా నిరాధారులైన వృద్ధులకు ఉచిత భోజనం వసతి వగైరా ఏర్పాట్లు.

**అతిథులకు ఏర్పాట్లు :** ఒంటరిగా గాని, కుటుంబాలతో గాని, సమూహంగా గాని వచ్చు భక్తులు ప్రశాంతంగా గడుపుటకు వలయు చక్కటి వసతి, భోజన ఏర్పాట్లు గలవు.

# శ్రీశాంతి ఆశ్రమ వివిధ శాఖలలో జరుగు కార్యక్రమములు

**విశాఖపట్నం శాఖ :**

- 1966వ సంవత్సరములో శ్రీశాంతి ప్రాథమిక పాఠశాల ప్రారంభించబడి, ఇపుడు ఉన్నత పాఠశాలగా కొనసాగుచున్నది.
- 1974 వ సంవత్సరములో Omkar and Lions School for Deaf and Dumb ప్రారంభించబడినది. విశేషంగా 90 మంది బదిర (చెవుడు, మూగ) బాలురకు ఉచిత నివాసం భోజన వసతి కూడ ఇవ్వబడుతున్నది. మరియు ఈ పాఠశాలలో వీరికి విద్యతోపాటు ఉపాధి విద్య అంటే విశేషంగా Junior Diploma in Fine Arts & Senior Diploma in fine Arts అని ప్రారంభించబడి అందులో భాగంగా Hand made paper making, Bamboo crafting, Painting, wood work, clay work, stone carving వంటివి నేర్పబడుచున్నవి.
- శ్రీ శాంతి పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఉన్నత పాఠశాల విద్య తర్వాత, ఇంటర్మీడియట్ మరియు పాలిటెక్నిక్ వంటి వృత్తి విద్యా కోర్సులలో చేర్పించుట జరుగుచున్నది. అంతేకాకుండా ఆ తర్వాత కూడా ఉన్నత విద్యలకు ప్రోత్సహించి ఆర్థిక సహాయం అందించుట జరుగుచున్నది వీరికి కూడ ఆశ్రమములో ఉచిత నివాస, భోజన వ్యవస్థ కలదు.
- ఆధ్యాత్మిక సాధనలో భాగంగా సత్సంగములు, ఆధ్యాత్మిక ప్రవచనములు జరుపబడుచున్నవి.
- వైద్యసేవలో భాగంగా ఆంగ్ల, హోమియో వైద్య శిబిరము నిర్వహించ బడుచున్నవి.

**కోటగిరి శాఖ :**

- విశ్వశాంతి మెట్రిక్యులేషన్ విద్యాలయ 1980 వ సంవత్సరములో స్థాపింపబడి, ప్రస్తుతం 1500 మంది విద్యార్థులు విద్యనభ్యసించుచున్నారు. పేద విద్యార్థులకు విద్యాశుల్కములో సడలింపు గలదు. మరియు విద్యతో పాటు విద్యార్థులకు సంగీతము, కరాటే, క్రీడారంగములో విశేష ప్రశిక్షణ, ప్రోత్సాహము ఇవ్వబడుచున్నవి.
- ప్రతి సంవత్సరము మే నెల పూర్తిగా, 2 సాధనా శిబిరములు ఆధ్యాత్మిక జిజ్ఞాసుల కొరకు నిర్వహించబడుచున్నవి.

**కాకినాడ శాఖ :**

- ప్రతి శని, ఆదివారములలో శాస్త్రీయ సంగీతము మరియు శాస్త్రీయ నృత్యము ఉచితంగా నేర్పబడుచున్నది. మరియు యోగ శిబిరములు, సత్సంగములు, ఆధ్యాత్మిక కార్యక్రమములు క్రమబద్ధంగా జరుగుచున్నవి.

విశాఖపట్నం, కోటగిరి, కాకినాడ, పిఠాపురం అన్ని శాఖలలోను స్వామి ఓంకార్ జన్మదినం మరియు ఆరాధన జరుపబడుచున్నవి. మరియు ప్రతి నెల పేద వృద్ధులకు బియ్యము, పప్పు వితరణ చేయబడుచున్నది.

---

**1. మాతృ ఆశ్రమం :**
శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్: 533446
వయా శంఖవరం, తూ.గో.జిల్లా
ఫోన్: 7382009962

**2. విశాఖపట్నం శాఖ:**
లాసన్స్ బే, పెద వాల్తేరు – 530017
విశాఖపట్నం,
ఫోన్: 0891–2538689

**3. విశ్వశాంతి క్షేత్రం:**
కైలాసగిరి,
విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ:**
Peace Center
Darmona Road,
KOTAGIRI - 643 217
Nilagiri Dist., Tamilnadu
Ph: 04266-271945

**5. కాకినాడ శాఖ:**
శాంతి ఆశ్రమము,
అశోక్ నగర్, కాకినాడ
533 004 తూ.గో.జిల్లా

**5. పిఠాపురం శాఖ:**
స్టువార్టుపేట, పిఠాపురం
533 450